Follow: @ANNTELUGU
27-03-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 89 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



భూలోక వైకుంఠం
## భద్రాచలం
సర్వాంగ సుందరంగా ముస్తాబైన పుణ్యక్షేత్రం!
నేడే సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవం!
కల్యాణానికి సీఎం రేవంత్ రెడ్డి దంపతులు

**భద్రాచలం, మహా:** **చైత్ర శుద్ధ నవమి...హైందవ లోకానికి అత్యంత పవిత్రమైన, పులకరింతను కలిగించే పర్వదినం. శ్రీకారాన్ని, ఓంకారాన్ని ముడివేసుకుని, ధర్మ సంస్థాపనార్థం అవతరించిన శ్రీరామచంద్రుడి జన్మ దినం.. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు ఆ సీతమ్మను పట్టుదారంతో తన దరికి చేర్చుకునే సుదినం! 'దక్షిణ అయోధ్య'గా దేదీప్యమానంగా వెలుగొందుతున్న భద్రాచలం ఇప్పుడు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్త రామదాసు కీర్తనలతో నిత్యం ప్రతిధ్వనించే ఆ పుణ్య గోదావరి తీరం, సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. స్వామివారి పెళ్లి వేడుకను

మిగతా 2లో

టాప్ న్యూస్



అమెరికా గెలవదు ఇరాన్ ఓడిపోదు
- పశ్చిమాసియా సంక్షోభంపై బాబా రాందేవ్

02



2029లో కొత్త నియోజకవర్గాలు
- పునర్విభజనపై చంద్రబాబు వ్యాఖ్యలు

02



సీఎంలతో నేడు మోదీ అత్యవసర భేటీ
- పెట్రోల్, డీజిల్ కొరత ప్రచారంపై సీరియస్

02

# విద్య వైద్యంలో నో కాంప్రమైజ్

## మా ప్రభుత్వ ప్రాధాన్యతలివే...
ఆరోగ్యశ్రీకి రూ. 2,408 కోట్లు చెల్లించాం
గత సర్కారు తప్పులు సరిచేస్తున్నాం
అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** గత ప్రభుత్వ హయాం నుంచి తమకు రూ. 600 కోట్ల బకాయిలు వారసత్వంగా వచ్చాయని, ఆ భారాన్ని మోస్తూనే తమ ప్రభుత్వం పేదల వైద్యం కోసం పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వ ప్రాధాన్యం విద్య, వైద్యమేనని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేస్తున్నాం. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవు. కోతలు పెట్టాల్సివస్తే వేరే వారికి కోతలు పెడతాం. పేదల విద్య, వైద్యం విషయంలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తి లేదు'' అని రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం ప్రతి నెలా సగటున రూ. 89 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి

మిగతా 2లో

## ఎంఎంటీఎస్‌కు ఏమైంది?
- ప్రయాణికుల సంఖ్య తగ్గుతుండటంపై సీఎం రేవంత్ ఆరా
- ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సేవలు మారాలని సూచన
- స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలని సలహా

02

## ప్రకాశం జిల్లాలో ఘోరప్రమాదం
- టిప్పర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- 13 మంది ప్రయాణికులు సజీవదహనం
- బాధ్యులపై కఠిన చర్యలు: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

02



## ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి మోక్షం..
డీపీఆర్ రూపకల్పనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్!
ఆర్‌ఆర్‌ఆర్ సౌత్ పార్ట్‌పై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన

02






ANN తెలుగు
మహా పత్రిక 02
శుక్రవారం, హైదరాబాద్ | 27-03-2026 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# ఎంఎంటీఎస్‌కు ఏమైంది?

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖం పట్టడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు సమయపాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని సీఎం తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతులు మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్‌యూఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లాలో ఘోరప్రమాదం

**టిప్పర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు.. 13 మంది ప్రయాణికులు సజీవదహనం.. బాధ్యులపై కఠిన చర్యలు: మంత్రి రాంప్రసాద్ రెడ్డి**

**మార్కాపురం, మహా:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో గురువారం తెల్లవారుజామున అత్యంత విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. మార్కాపురం మండలం రాయవరం సమీపంలోని పలకల క్వారీ వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టిప్పర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో 13 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యారు. 22మందికి తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల , నిర్మల్ ప్రాంతాల నుండి నెల్లూరు జిల్లా వింజమూరు, ఉదయగిరి వైపు వెళ్తున్న 'హరికృష్ణ ట్రావెల్స్' బస్సు రాయవరం సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బస్సులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. నిద్రలో ఉన్న ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మంటలు బస్సు మొత్తాన్ని చుట్టుముట్టాయి.



ఘటనా స్థలంలో భీతావాహ పరిస్థితి

**సజీవదహనమైన ప్రయాణికులు**

బస్సులో మంటలు భారీగా ఎగసిపడటంతో ప్రయాణికులు బయటకు వచ్చే మార్గం లేక లోపలే చిక్కుకుపోయారు. ఈ భీతావాహ పరిస్థితిలో 13 మంది ప్రయాణికులు సజీవదహనం కాగా, మరో 22 మంది కిటికీల నుండి దూకి ప్రాణాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని పోలీసులు మరియు స్థానికులు వెంటనే మార్కాపురం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా అస్థిపంజరంలా మారిపోయింది. మృతుల శరీరాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో ఆ ప్రాంతమంతా ఆక్రందనలు, హాహాకారాలతో నిండిపోయింది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం లేదా అతివేగంగా నడపడం వల్లే ఈ దుర్ఘటన జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల వివరాలను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

**బాధ్యులపై కఠిన చర్యలు: మంత్రి రాంప్రసాద్ రెడ్డి**

మార్కాపురం, మార్చి 26: ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన బస్సు ప్రమాద ఘటన బాధాకరమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈరోజు ఉదయం బస్సు ప్రమాద ఘటనా స్థలాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాదంలో 13 మంది మరణించారని... మృతుల కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి వెల్లడించారు.

# విద్య వైద్యంలో నో కాంప్రమైజ్

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకు ఏకంగా రూ. 2,408.51 కోట్లను ఆరోగ్యశ్రీ బకాయిల కింద చెల్లించిందని గణాంకాలతో వివరించారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 1,480 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. పేదల వైద్యం విషయంలో ఒక్క రూపాయి కూడా కోత విధించే ప్రసక్తే లేదని, అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని సీఎం భరోసా ఇచ్చారు.

**సీఎంఆర్ఎఫ్ దుర్వినియోగం**

గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సుమారు రూ. 2,046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎలా దుర్వినియోగం అయ్యాయనే అంశంపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని సభకు తెలిపారు. అర్హులైన పేదలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టించిన వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అదేవిధంగా, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచడం ద్వారా పేదలకు మరింత నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చామని ఆయన గుర్తు చేశారు. విద్యా, వైద్య రంగాలు తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత గల అంశాలని, భవిష్యత్తులో ఈ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. వైద్య మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా హైదరాబాద్‌లోని గోషామహల్ పరిధిలో 30 ఎకరాల విస్తీర్ణంలో రూ. 3,000 కోట్లతో అత్యాధునిక ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పనులను వేగవంతం చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, అలాగే విదేశాల్లోని నిపుణులైన వైద్యుల సేవలను కూడా వినియోగించుకుంటామని చెప్పారు. ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే ఉద్దేశంతో సరికొత్త 'జీవిత బీమా' పథకాన్ని తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. టీచింగ్ ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతలను గ్రూప్ 1 అధికారులకు అప్పగించడం ద్వారా వైద్య సేవల్లో జవాబుదారీతనం పెంచుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రతిపక్షాలు ఇచ్చే నిర్మాణాత్మక సూచనలను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# భూలోక వైకుంఠం భద్రాచలం

(మొదటిపేజీ తరువాయి)

కనులారా చూసి తరించి, పునీతులవ్వడానికి లక్షలాది మంది భక్తులు గోదావరి తీరానికి పోటెత్తుతున్నారు. ఈ అపురూప ఘట్టాన్ని కనువిందు చేసేలా ప్రభుత్వం, దేవస్థానం అధికారులు సమన్వయంతో బ్రహ్మాండమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు సంప్రదాయం ప్రకారం రామయ్య కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకుని హాజరుకానున్నారు. కమనీయంగా సాగే కల్యాణోత్సవ వేడుకను కనులారా తిలకించనున్నారు. అనంతరం భద్రాద్రి క్షేత్ర ప్రగతి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.



**కల్యాణ వైభవమే..కమనీయ దర్బారే!**

అణువణువూ రామమయం.. శోభాయమానంగా మిథిలా ప్రాంగణం ..రామనామ స్మరణతో భద్రాద్రి గిరులు మార్మోగుతున్నాయి. ఆలయ ప్రాంగణం మొదలుకొని మిథిలా స్టేడియం వరకు ఎటు చూసినా పచ్చతోరణాలు, విద్యుద్దీపాల కాంతులు నయనానందకరంగా దర్శనమిస్తున్నాయి. లోకాభిరాముడైన శ్రీరామచంద్రుడు, జగన్మాత సీతాదేవిల కల్యాణ ఘట్టాన్ని సాక్షాత్కరింపజేసేందుకు మిథిలా ప్రాంగణంలోని కల్యాణ మండపాన్ని అత్యంత సుందరంగా, పవిత్రంగా తీర్చిదిద్దారు. నిన్నటి దినాన వైభవంగా జరిగిన 'ఎదురుకోలు' ఉత్సవంతో పెళ్లి సందడి మొదలైంది. నేడు అభిజిత్ లగ్న సుముహూర్తాన, వేద మంత్రోచ్ఛారణల నడుమ, సీతమ్మ మెడలో మాంగల్యధారణ మరియు స్వామివారి శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచే అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆనవాయితీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వ ప్రతినిధులు స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాల కోసం ఆణిముత్యాలను సమర్పించనున్నారు.

**వేసవి తాపాన్ని సైతం లెక్కచేయకుండా**

రాముడిపై ఉన్న భక్తి ముందు భానుడి భగభగలు సైతం చిన్నబోతున్నాయి. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం అహర్నిశలు శ్రమించి పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మిథిలా స్టేడియంలో లక్షలాది మంది కూర్చునేందుకు వీలుగా భారీ చలువ పందిళ్లు (టెంట్లు) వేశారు. చల్లని గాలి కోసం కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించేందుకు లక్షలాది మంచినీటి ప్యాకెట్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను స్వచ్ఛంద సంస్థల సహకారంతో పంపిణీ చేయడానికి సన్నద్ధమయ్యారు. భక్తులందరికీ కల్యాణ ఘట్టం స్పష్టంగా కనిపించేలా ప్రాంగణం నలుమూలలా భారీ ఎల్‌ఈడీ ,స్క్రీన్లను అమర్చారు.

**లక్షల కొద్దీ లడ్డూ ప్రసాదాలు**

స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు పంపిణీ చేసేందుకు దేవస్థానం అధికారులు ఇప్పటికే సుమారు లక్షల సంఖ్యలో లడ్డూ ప్రసాదాలను, తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, సామాన్య భక్తులకు దర్శనంలో కానీ, కల్యాణ వీక్షణంలో కానీ ఎటువంటి అంతరాయం కలగకుండా సెక్టార్ల వారీగా బారికేడ్లు నిర్మించారు. పోలీసులు అడుగడుగునా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పట్టణ శివార్లలోనే భారీ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచారు.

## 2029లో కొత్త నియోజకవర్గాలు

**పునర్విభజనపై చంద్రబాబు వ్యాఖ్యలు**

**అమరావతి, మహా:** రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కేబినెట్ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య సుమారు 50 శాతం పెరిగే అవకాశముందని వెల్లడించారు. పునర్విభజనతో రాజకీయ అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని సీఎం పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రులకు సూచించారు. బడ్జెట్ విషయానికొస్తే, రాష్ట్ర బడ్జెట్‌లో సుమారు 90 శాతం నిధులు ఉద్యోగుల జీతాలకే వెళ్తున్నాయని చంద్రబాబు తెలిపారు. కాగా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ పునర్విభజన చట్టంలో సవరణలతో పాటు, అమరావతిని శాశ్వత రాజధానిగా కొనసాగించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని నిర్ణయించింది.

# సీఎంలతో నేడు మోదీ అత్యవసర భేటీ

**పెట్రోల్, డీజిల్ కొరత ప్రచారంపై సీరియస్**

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ , ఎల్పీజీ సరఫరాలో స్వల్ప అంతరాయాలు కనిపిస్తుండటం, ప్రైవేట్ సంస్థలు ధరలు పెంచడం వంటి పరిణామాలు కేంద్ర ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం నిర్వహించబోయే ముఖ్యమంత్రుల సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన నిల్వలను ఎలా నిర్వహించాలి, కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై ప్రధాని దిశానిర్దేశం చేయనున్నారు. ఇటీవలే పార్లమెంట్ వేదికగా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు దేశంలో యుద్ధ భయాల తీవ్రతను అద్దం పడుతున్నాయి. ఎలాంటి గడ్డు పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవడానికి ప్రజలు, ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని ఆయన రాజ్యసభ సాక్షిగా పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే, దౌత్య మార్గాల ద్వారా శాంతిని నెలకొల్పేందుకు అటు అమెరికా, ఇటు ఇరాన్ , ఇజ్రాయెల్ దేశాల నాయకులతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. అయితే, క్షేత్రస్థాయిలో యుద్ధం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో తెలియని పరిస్థితి ఉండటంతో, దేశీయ భద్రత మరియు ఇంధన భద్రతపై రాజీ పడకూడదని కేంద్రం గట్టి నిశ్చయంతో ఉంది. శుక్రవారం జరగబోయే వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి సారించబోతున్నారు. మొదటిది, గల్ఫ్ దేశాల్లో ఉన్న లక్షలాది మంది భారతీయుల భద్రత. యుద్ధం ముదిరితే వారిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి రాష్ట్రాల సహకారం ఎంతైనా అవసరం. రెండవది, ఇంధన ధరల నియంత్రణ మరియు నిత్యావసర వస్తువుల సరఫరాలో అంతరాయం కలగకుండా చూడటం. మూడవది, అంతర్గత భద్రతపై నిఘా పెంచడం. యుద్ధ పరిస్థితులను ఆసరాగా చేసుకుని విద్రోహ శక్తులు దేశంలో అలజడి సృష్టించకుండా అప్రమత్తం చేయనున్నారు.

## అమెరికా గెలవదు ఇరాన్ ఓడిపోదు

**పశ్చిమాసియా సంక్షోభంపై బాబా రాందేవ్**

**మహా:** పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల సందర్భంలో యోగా గురు, పతంజలి సహ వ్యవస్థాపకుడు బాబా రాందేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధంలో అటు అమెరికా గెలవదని, ఇటు ఇరాన్ ఓడిపోదని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి స్థాపనలో భారత్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. హరిద్వార్‌లోని పతంజలి యోగపీఠ్‌లో గురువారం జరిగిన రామనవమి వేడుకల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "ఈ యుద్ధంలో అమెరికా గెలవదు, ఇరాన్ ఓడిపోదని నేను గతంలోనే చెప్పాను. 10001200 కిలోమీటర్ల నుంచి 4000 5000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడం ద్వారా, కేవలం ఆయుధాలతో ఎవరూ ఎవరినీ భయపెట్టలేరని ఇరాన్ నిరూపించింది" అని రాందేవ్ విశ్లేషించారు. ప్రజాస్వామ్యం అంటే ఇతరులను భయపెట్టడం కాదని ఆయన హితవు పలికారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గర్వపడే అమెరికా, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని కూడా గౌరవించాలని సూచించారు.

# ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి మోక్షం..

**డీపీఆర్ రూపకల్పనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్!**

**ఆర్ఆర్ఆర్ సౌత్ పార్ట్ పై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, రవాణా రంగానికి తలమానికంగా మారనున్న ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు ఇప్పుడు ద్విముఖ వ్యూహంతో పరుగులు పెడుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు కు ఆవల, సుమారు 340 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ప్రమాణాలతో రెండు భాగాలుగా (ఉత్తర, దక్షిణ) నిర్మించ తలపెట్టిన ఈ భారీ ప్రాజెక్టులో, నార్త్ పార్ట్ ఇప్పటికే కేంద్రం నుంచి మంజూరై టెండర్ల దశకు చేరుకుంది. అయితే, సౌత్ పార్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందనే దానిపై ఇన్నాళ్లూ సందిగ్ధత నెలకొంది. ఈ నిరీక్షణకు తెరదించుతూ, దక్షిణ భాగానికి డీపీఆర్ తయారు చేయడానికి అధికారికంగా ఒక కన్సల్టెన్సీని నియమించినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో పలుమార్లు ఢిల్లీ వెళ్లి, కేంద్ర మంత్రిని స్వయంగా కలిసి రాష్ట్ర ప్రాజెక్టుల ఆవశ్యకతను వివరించిన నేపథ్యంతో కేంద్రం నుంచి ఈ సానుకూల స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. "దక్షిణ భాగానికి డీపీఆర్ రూపకల్పన ప్రక్రియ మొదలైంది, కన్సల్టెన్సీ నియామకం కూడా పూర్తయింది" అని గడ్కరీ తన లేఖలో పేర్కొనడం ప్రాజెక్టు సాకారం దిశగా పడుతున్న బలమైన అడుగుగా చెప్పవచ్చు. కేంద్రం నుంచి వచ్చిన ఈ తీపికబురు పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ, నితిన్ గడ్కరీకి రాష్ట్ర ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్తర భాగం పనులు ఒక కొలిక్కి వస్తున్న తరుణంలో, దక్షిణ భాగం పట్ల కూడా కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవడం గొప్ప పరిణామమని ఆయన కొనియాడారు. రీజనల్ రింగ్ రోడ్ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జిల్లాల దశ, దిశ మారిపోనుంది. ప్రధానంగా సంగారెడ్డి, నల్గొండ, భువనగిరి, చేవెళ్ల, షాద్‌నగర్ వంటి ప్రాంతాల్లో పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్ పార్కులు, భారీ టౌన్‌షిప్‌ల విస్తరణకు ఈ రహదారి ఒక 'గేమ్ చేంజర్' కాబోతోందని మంత్రి కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



## జగ్గారెడ్డికి క్లీన్ చిట్

**మానవ అక్రమ రవాణా కేసులో తీర్పు**

**సంగారెడ్డి, మహా :** మానవ అక్రమ రవాణా కేసులో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కి ప్రజాప్రతినిధుల కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. 2018లో నమోదైన కేసును గురువారం విచారించిన ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఈ కేసులో ఏ1 గా ఉన్న జగ్గారెడ్డి , ఏ3గా ఉన్న కుసుమ కుమార్ ల కేసులో నేరాలు రుజువు కాలేదని వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. 2004లో అమెరికాకు మానవ అక్రమ రవాణా చేశారని, నకిలీ డాక్యుమెంట్లతో పాస్‌పోర్టులు సంపాదించారనే ఆరోపణలతో జగ్గారెడ్డి, కుసుమ కుమార్‌లపై కేసు నమోదైంది. 2004లో జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన భార్య, కుమార్తె, కుమారుడి పేర్లతో నకిలీ ధృవీకరణ పత్రాలు సమర్పించి మరో ముగ్గురు వ్యక్తులకు పాస్‌పోర్టులు తీసుకొచ్చి, వారిని అమెరికాకు తీసుకెళ్లారని ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో తన అధికారిక లెటర్‌ప్యాడ్‌పై ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి సహాయం చేశారని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో జగ్గారెడ్డి మానవ అక్రమ రవాణాకు పాల్పడ్డారని, నకిలీ డాక్యుమెంట్లు సమర్పించి ముగ్గురిని అమెరికాకు తీసుకెళ్లి డబ్బు సంపాదించారని 2018లో జగ్గారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ సమయంలో ఆయన సుమారు మూడు నెలల పాటు జైలు శిక్ష అనుభవించారు. ఈ కేసుపై విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు జగ్గారెడ్డి , కుసుమ కుమార్ లను నిర్దోషులుగా తేల్చి తీర్పు ఇచ్చింది. ఈ కేసులో జగ్గారెడ్డి ,కుసుమ కుమార్ తరపున న్యాయవాది జి.సంతోష్ రెడ్డి వాదించారు.

# బెంగళూరు బ్యాక్.. హైదరాబాద్ ఫస్ట్

- దేశంలోనే బెస్ట్ సిటీగా నిలిచిన హైదరాబాద్
- అన్ బాక్సింగ్ బీఎల్ఆర్ తాజా నివేదిక వెల్లడి



**హైదరాబాద్, మహా :** ప్రపంచ నగరాలతో పోటీ పడుతూ విశ్వనగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ పెట్టుబడులకు కేంద్రంగా మారింది. నగరంలో ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన వారు కూడా నగరంలో ఉపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మహానగరం మరోసారి తన సత్తా చాటింది. దేశంలోని మెట్రో నగరాలన్నింటిని వెనక్కి నెట్టి 'నివసించడానికి అత్యంత అనుకూలమైన నగరం'గా అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ సంస్థ అన్‌బాక్సింగ్ బీఎల్ఆర్ తాజాగా విడుదల చేసిన 'వుయ్ ఆర్ సిటీ 2026' నివేదికలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలోని ఎనిమిది ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ అన్ని రంగాల్లోనూ సత్తా చాటింది. పటిష్టమైన రియల్ ఎస్టేట్ మార్కెట్, సామాన్యుడికి అందుబాటులో ఉన్న రవాణా సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఇలా పలు ప్రత్యేకతలు హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయి. ఒకప్పుడు బెంగళూరు మాత్రమే ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది, కానీ ఇప్పుడు బెంగళూరు ఆధిపత్యానికి హైదరాబాద్ సవాల్ విసురుతోంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, ఉద్యోగ కల్పనలో హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అన్‌బాక్సింగ్ బీఎల్ఆర్ నివేదిక ప్రకారం హైదరాబాద్, బెంగళూరు నగరాలు కలిసి దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జనాభా పరంగా ముంబై, ఢిల్లీ ఎంతో పెద్దవైనప్పటికీ ఆర్థిక వృద్ధిలో మాత్రం ఈ రెండు నగరాలు వాటిని మించిపోతున్నాయి. పదేళ్ల క్రితం దేశంలోని టాప్8 నగరాల్లో కొత్త కంపెనీల ఏర్పాటులో ఈ రెండు నగరాల వాటా 15 శాతం ఉండగా గత ఆర్థిక సంవత్సరం నాటికి అది 25 శాతానికి పెరిగింది. కార్యాలయాల విస్తరణ, గృహ రుణాల మంజూరు, విమాన ప్రయాణాలు, విద్యార్థుల చదువు వంటి అంశాల్లో ఈ రెండు నగరాలు అగ్రగామిగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా దేశంలోని అత్యంత ధనిక జిల్లాల్లో ఒకటిగా నిలిచింది. ఆఫీస్ స్పేస్ అద్దె విషయానికి వస్తే బెంగళూరుకు హైదరాబాద్ కేవలం 15 శాతం దూరంలోనే ఉంది. కొత్త కంపెనీల ఏర్పాటులో బెంగళూరుతో హైదరాబాద్ సమంగా నిలవడం విశేషం. అయితే ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లు, సోషల్ ఈవెంట్స్, వినోదంపై పెట్టే ఖర్చుల విషయంలో బెంగళూరు నగరవాసులు ముందుండగా హైదరాబాద్ ప్రజలు గృహ నిర్మాణం వంటి సంప్రదాయ పెట్టుబడులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అభివృద్ధి ఎంత ఉన్నా రవాణా విషయంలో రెండు నగరాలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని రిపోర్టు వెల్లడించింది. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ విపరీతంగా ఉంది. హైదరాబాద్‌లోనూ ఐటీ కారిడార్లలో ఆఫీసులకు వెళ్లే వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. బెంగళూరు కంటే హైదరాబాద్‌లో వాహనాల వేగం 20 శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ.. ప్రయాణ సమయం మాత్రం దాదాపు సమానంగా ఉండటం గమనార్హం. ఈ రిపోర్టు ప్రకారం మౌలిక సదుపాయాలు, జీవన ప్రమాణాల మెరుగుదలతో హైదరాబాద్ ఇప్పుడు దేశానికే తలమానికంగా, బెస్ట్ సిటీగా నిలిచింది.



## పాఠశాలలో విద్యార్థులచే విత్తన బంతుల తయారీ

**వేములవాడ,మహా:** మార్చి 21 అంతర్జాతీయ అటవీ దినోత్సవం గురువారం వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే విత్తన బంతులను తయారీ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం డ్రాయింగ్,వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అడవులను సంరక్షించడంలో భాగంగా ఈ విత్తన బంతులు (సీడ్ బాల్స్) ఎంతగానో ఉపయోగపడతాయి, అంతేకాకుండా విద్యార్థులకు విత్తన బంతులు తయారు చేయడంపై అవగాహనతో పాటు,పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చని చెట్లను విస్తరించడంలో ఇట్టి విత్తన బంతుల ప్రాధాన్యత విద్యార్థులకు వివరించారు. ఇట్టి కార్యక్రమంలో 70 మంది విద్యార్థులు 1000కి పైగా విత్తన బంతులను తయారు చేశారు.ఈ కార్యక్రమంలో సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకిని. కిషన్ మాట్లాడుతూ సీడ్ బాల్స్ అడవులను పెంపొందించడంలో ప్రముఖ పాత్ర వహిస్తాయని తెలిపారు, ఇట్టి విత్తన బంతులను తయారు చేసిన విద్యార్థిని, విద్యార్థులను నేషనల్ గ్రీన్ కోర్ గైడ్ టీచర్ దూస.సంతోష్ అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# 2026-27 కాంగ్రెస్ ప్రభుత్వ వార్షిక బడ్జెట్..

- ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట..
- రూ.3.24 లక్షల కోట్ల బడ్జెట్‌పై కేటాయింపుపై ప్రశంసలు..
- ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్న ఎమ్మెల్యే పాయం..



**మణుగూరు మహా :** ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.3,24,234 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం అభినందనీయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అసెంబ్లీ వేదికగా ఆయన మాట్లాడుతూ 6 గ్యారెంటీల పథకాలు అమలు తోపాటు గిరిజన సంక్షేమం, విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వానికి సామాన్య, పేదల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు.అభివృద్ధి-సంక్షేమం రెండింటికీ సమానంగా నిధులు కేటాయించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతులకు, విద్యార్థులకు, బలహీన వర్గాలకు ఈ బడ్జెట్ పెద్ద ఊరటనిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు రాష్ట్రాన్ని మరింత ప్రగతిపథంలో నడిపిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# సొంత నియోజకవర్గాలకే మంత్రుల ప్రాధాన్యత

## ఏజెన్సీ నియోజకవర్గాల నిర్లక్ష్యం

- వైరా, ఇల్లందు శాసన సభ్యులు సాగు నీరు కోసం గళం విప్పాలి
- సీతారామ ప్రాజెక్టు నిధులు లేమికి ముగ్గురు మంత్రులదే భాధ్యత
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ
- సంక్షేమ పథకాలు కేటాయింపులు పెంచాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండె బోయిన నాగేశ్వరరావు



**కారేపల్లి, మహా :**జిల్లా లోని ముగ్గురు మంత్రులు తమ సొంత నియోజకవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ గిరిజన నియోజకవర్గాలకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాల భూమి కి సాగు నీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తిచేయాలి అందుకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కారేపల్లి క్రాస్ రోడ్లో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు , వజ్జా రామారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా ముగ్గురు మంత్రులు తమ సొంత నియోజకవర్గ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తు గిరిజన నియోజకవర్గాలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు . గిరిజన నియోజకవర్గాలకు సాగు నీరు అందించేందుకు వైరా, ఇల్లందు శాసన సభ్యులు గళం విప్పాలి అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరం కు శాసనసభ లో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ఏడు లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న సీతారామ ప్రాజెక్టు మిగిలిన పనుల కు 9000 కోట్ల రూపాయలు అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో 336కోట్ల రూపాయలు నిధులు కేటాయింపులు చేయుడం పై ముగ్గురు మంత్రులు భాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.గోదావరి నది పై సీతమ్మ బ్యారేజి నిర్మాణం పూర్తి చేయకుండా సాగు నీరు 2026 ఆగస్టు 15 నాటికి అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైరా రైతు సభలో ప్రకటించారు అని గుర్తు చేశారు. కేసిఆర్ ప్రభుత్వం పూర్తి చేసిన పనులు ఆధారంగా నీరు కొని ప్రాంతాలకు అందించే ప్రయత్నం తప్ప , పాలేరు రిజర్వాయర్ కు అనుసంధానం చేసే పనులు పూర్తి చేయడం లేదని అన్నారు, కారేపల్లి, కామేపల్లి రెండు మండలాల్లో స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి సాగు నీటి వనరులు కల్పించలేదు అన్నారు, బుగ్గ వాగు మీద విశ్వనాథపల్లి వద్ద రాజ్య సభ మాజీ సభ్యులు యల్లమంచిలి రాధాకృష్ణ మూర్తి నిధులు నుంచి ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ పనిచేయక పోయినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని అన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి అయిన ప్రధాన కాలువలు ఆధారంగా కామేపల్లి, కారేపల్లి మండలాల్లో భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు విద్యా, వైద్య రంగాలకు నిధులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండె బోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆక్స్ఫర్డ్, క్రేంబిడ్జి స్థాయిలో తెలంగాణ విద్యార్థులకు విద్యా అందించాలంటే ప్రభుత్వ విద్యా సంస్థలు అన్నింటిలో అత్యంత నాణ్యమైన వసతులు, సౌకర్యాలు కల్పించడం తోపాటు విద్యాలో ఉన్న అంతరాలను రూపు మా పాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ భీమా పథకం కుటుంబ సభ్యులు అందరికీ వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు, ఇండ్ల స్థలాలు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అందుకు అవసరమైన నిధులు బడ్జెట్ లో కేటాయించాలని కోరారు. లోపభూయిష్టంగా ఉన్న విద్యా విధానం మూలంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విద్యా విధానాన్ని అన్ని స్థాయిల్లో సంస్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సినీయర్ నాయకులు ఇంజం నాగభూషణం, సిఐటియు జిల్లా నాయకులు కుందనపల్లి నరేంద్ర, బాదావత్ శ్రీనివాసరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు ముళ్ళ ఏకాంబరం, పాసిన్ని నాగేశ్వరరావు, కేసాగని ఉపేందర్, ఏడుకొండలు ,రాంబాబు, విశ్వనాథ పల్లి ఉపసర్పంచ్ ధన్నం, సైదులు నిర్వాసితుల సంఘం నాయకులు షరీఫ్, సంగెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# గురుకులాల్లో ఆరోగ్య శిబిరాలు..

### విద్యార్థినులకు అవగాహన..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏజిహెచ్ఎస్ బాలికల పాఠశాల అంబేద్కర్ సెంటర్, ఎంజేపీటిబిసి బాలికల గురుకులం, ఎంజేపీటిబిసి బాలుర గురుకులంలో గురువారం ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. టిబి నిర్మూలన లక్ష్యంతో జరుగుతున్న టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు టిబి వ్యాధి లక్షణాలు, వ్యాప్తి విధానం, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. టీకా ప్రాముఖ్యతను వివరించి పద్నాలుగు నుండి పదిహేను సంవత్సరాల మధ్య ఉన్న బాలికలు తప్పనిసరిగా ఈ టీకా తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సునీల్ సూచించారు. అనంతరం హాస్టళ్లలోని పరిసరాలు, వంటశాల, నిల్వ గదులు, మరుగుదొడ్లు పరిశీలించి తగిన సూచనలు చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు శుభ్రమైన తాగునీటిని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, వైద్య సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, సుమ పాల్గొన్నారు.

# మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

### తహసిల్దార్ కు సీపీఐ(ఎం) వినతి



**కారేపల్లి, మహా:**రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర కల్పించటానికి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి సింగరేణి తహసిల్దార్ కు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కే.నరేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ లో పత్తి, మిర్చి దెబ్బతిని ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న పంటను రైతులు ఎంచుకొని విరివిగా వేశారన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 2400 ఉండగా ప్రైవేటు వ్యాపారస్తులు మాత్రం మొక్కజొన్నలను క్వింటా రూ.1600 కు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో రైతులు తమ పంటను అరకొర ధరకు అమ్మకానికి పెడుతున్నారన్నారు. పంటలను మద్దతు ధరలకు అమ్ముకోవడానికి మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటకు గిట్టుబాటు ధర అందించాలని, వరితో పాటు మొక్కజొన్నకు కూడా బోనస్ ను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. వరి, మొక్కజొన్న పంటలు వేయ్యవద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్న మాటలు రైతాంగానికి ఆందోళన గురి చేస్తున్నాయన్నారు. పంటలు రైతు చేతికి వస్తున్న ప్రస్తుత తరుణంలో కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని లేనియెడల రైతులను కూడగట్టి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, నాయకులు తలారి దేవ ప్రకాష్, పోడు భూముల సంఘం నాయకులు పాసిని నాగేశ్వరరావు, ఈసం వెంకటేశ్వర్లు, అరేం రవి, భూక్య మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.



# భద్రాద్రి రామయ్య ఆలయ ఉత్సవ కమిటీ ప్రకటన

### 14 మంది సభ్యులతో కొత్త బృందం!

**భద్రాచలం మహా :** దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో త్వరలో జరగనున్న ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులుగా 14 మంది పేర్లను ప్రతిపాదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో ప్రముఖంగా బూర్గంపహాడ్ మండలానికి చెందిన పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి పేరు ఉండటం విశేషం.

**ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు**

ప్రతి ఏట భద్రాద్రిలో జరిగే శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ వేడుకలను భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. స్థానిక నాయకత్వానికి, భక్తుల మనోభావాలకు పెద్దపీట వేస్తూ ఈ 14 మంది సభ్యుల బృందాన్ని ఎంపికలు సూచిస్తున్నాయి.

**పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డికి కీలక బాధ్యత?**

ఈ ప్రతిపాదిత కమిటీలో పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి పేరు ఉండటంపై భక్తులు మరియు స్థానిక వర్గాల్లో ఆసక్తి చూపారు. ఆయన గతంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఉన్న అంకితభావాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ అవకాశం కల్పించినట్లు సమాచారం. కమిటీలోని మిగిలిన సభ్యులతో సమన్వయం చేసుకుంటూ, ఉత్సవాలను విజయవంతం చేయడంలో ఆయన పాత్ర కీలకం.

# భద్రాచలాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి

- దక్షిణ అయోధ్య భద్రాద్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
- భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.351 కోట్లను మంజూరు
- సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భక్త రామదాసు నిర్మించిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం "దక్షిణ అయోధ్య"గా ప్రసిద్ధి చెందినదని ఈ పవిత్ర క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. గురువారం భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు విచ్చేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని వీఐపీలు వివిఐపీలు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు స్వామి వారి కల్యాణం, 28వ తేదీన అదే సమయాల్లో మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

**భద్రాచలం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు...**

భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. స్వామివారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధితోపాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు రహదారులు రైల్వే నదీ మార్గాల అభివృద్ధిపై చర్యలు తీసుకుంటున్నామని అమరావతి-జగదల్పూర్ మధ్య రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని కరకట్టల ఎత్తు పెంపు, ఘాట్ ల నిర్మాణం, రెండో పీట నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో భక్తుల రాకను మరింత సులభతరం చేసే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అనంతరం భద్రాచలం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల ఫోటోలను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం మిథిలా స్టేడియం వద్ద జిల్లా కలెక్టర్ అంకిత్ సెక్టార్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలంబ్రాల కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వైద్య సదుపాయాలు వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.సెక్టార్ అధికారులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఉత్కంఠంగా మణుగూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు

- 2 ఓట్ల ఆధిక్యంతో గురుకృష్ణ విజయం
- ఉపాధ్యక్షురాలిగా సావిత్రి..
- ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్ గెలుపు



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రథమ శ్రేణి జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలోని న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ఉత్కంఠభరితంగా జరిగాయి. అసోసియేషన్‌లో మొత్తం 54 మంది న్యాయవాదులు ఉండగా, ఒకరు గైర్హాజరు కావడంతో 53 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.అధ్యక్ష పదవికి గురుకృష్ణ, చిర్రా రవికుమార్, జాడి చొక్కాయల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. చివరకు రెండు ఓట్ల తేడాతో గురుకృష్ణ విజయం సాధించారు. జాడి చొక్కాయ 21 ఓట్లు, చిర్రా రవికుమార్ 9 ఓట్లు పొందారు. ఉపాధ్యక్ష పదవికి జరిగిన పోటీలో న్యాయవాది సావిత్రి 28 ఓట్లు సాధించి, ప్రత్యర్థి అభ్యర్థి శైలజపై 4 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన పోటీలో కామసాని మధుసూదన్ 33 ఓట్లు సాధించి, ప్రత్యర్థి దాసరి కవితపై 7 ఓట్ల తేడాతో విజయం సాధించారు. దాసరి కవితకు 23 ఓట్లు లభించాయి. ఇతర పదవులలో జాయింట్ సెక్రటరీగా వెంకటరత్నం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా నాగార్జున రెడ్డి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు న్యాయవాది కె నగేష్ కుమార్ ఎన్నికల అధికారిగా, న్యాయవాది పద్మావతి సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.మిగిలిన పదవులను గెలుపొందిన ప్రతినిధులు నామినేషన్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు.

# సింగరేణిని కాపాడుకుందాం

- కార్మికుల ఉద్యోగ భద్రత హక్కులను రక్షించు కుందాం
- గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి మనుగడ ప్రమాదకరంగా మారిందని గోదావరి పరివాహక ప్రాంతంలో సింగరేణి సర్వే చేసిన ప్రకారం అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ నూతన బావులు తీయడం లేదని సింగరేణిని చరిత్రను సమాధి చేసే వైపున పాలకుల విధానాలున్నాయని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొత్తగూడెంలో ఐఎఫ్టియు కార్యాలయంలో ఐ.కృష్ణ అధ్యక్షతన గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల ఉద్యోగం ఉపాధికి తీవ్ర ప్రమాదం నెలకొందని సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలనుపరిష్కరించకుండా తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి మనుగడను కాపాడుకోవాల్సిన అవసరం, కార్మికుల హక్కులను ఉద్యోగ భద్రతను రక్షించుకోవాల్సిన అవసరం నెలకొందని ఇందుకు సింగరేణి కార్మిక సంఘాలన్నీ ఒక తాటి మీదకు వచ్చి బలమైన ఐక్య ఉద్యమ నిర్మాణానికి పూనుకోవాలని సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఐక్య ఉద్యమానికి నిర్మాణానికి ఏఐటియుసి బాధ్యతగా కార్మిక సంఘాలని ఐక్యం చేసేందుకు పూనుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సింగరేణి బొగ్గుగనుల అమ్మకాలతో మనుగడకు ప్రమాదం నెలకొందని వేలంలో పాల్గొనాలని ప్రభుత్వం అనుమతించడం సంస్థను సజీవంగా సమాధి చేయడం అవుతుందని అన్నారు. యాజమాన్యం కార్మికులపై స్వారీ చేస్తుందని సేఫ్టీని విస్మరించి ప్రమాదాలకు గురి చేస్తుందని మెడికల్ బోర్డు శాశ్వత జబ్బులు గల వారిని ఫిట్ చేసిందని దీన్ని సరిచేయాలని నాడే ఇఫ్టు డిమాండ్ చేసిందని ఇప్పుడు కోర్టు సహితం యాజమాన్యం వైఖరిని తప్పు పట్టిందని అన్నారు.150 మాస్టర్లు, వేధింపులు, మెడికల్ ఫిట్ అయిన వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం, భూపాలపల్లి, బెల్లంపల్లి తదితర సింగరేణి ప్రాంతాల్లో కొత్త గనులను సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సింగరేణి మనుగడ కార్మికుల సమస్యలపై ఐక్య ఉద్యమానికి ఇఫ్టు గత 10 నెలలుగా ప్రయత్నం చేసిందని గుర్తు చేస్తూ చేశారు. కార్మికుల సమస్యలపై, సింగరేణి మనుగడకు ఏఐటీయూసీ జాతా నిర్వహిస్తుందని ఇది న్యాయమైనదని దీనికి ఇఫ్టు సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందని చెప్పారు. సింగరేణి మనుగడ కోసం ఐక్యంగా అన్ని సంఘాలను కలుపుకొని బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణంకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జనరల్ సెక్రెటరీ జే.సీతారామయ్య, ఏ.వెంకన్న, ఎండి.రాసుద్దిన్, డి.బ్రహ్మానందం, ఈదునూరి రామకృష్ణ, కాపు కృష్ణ, తోట్ల రాయమల్లు, సంతు, సంజీవరావు, నాసర్ పాష, నరేష్, యన్.సంజీవ్, గౌని నాగేశ్వరరావు, రాజేశం, తోడేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# రూ.560 కోట్లతో తెలంగాణ ప్రభుత్వం భద్రాద్రి అభివృద్ధి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

### ఏ ఒక్కరి చేతిలో పార్టీ బందీగా లేదు... డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ

**నేలకొండపల్లి, మహా:** తెలంగాణ ప్రభుత్వం భద్రాచలం దేవాలయం ను రూ.560 కోట్ల తో అభివృద్ధి చేస్తుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని కోరట్లగూడెం లో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...గత ప్రభుత్వం శ్రీరాముని ని పూర్తిగా విస్మరించారని అన్నారు. సీఎం రేవంత్రెడ్డి, జిల్లా మంత్రుల ప్రత్యేక దృష్టి తో రూ.560 కోట్ల తో దశల వారీగా అభివృద్ధి చేస్తుందని అన్నారు. గత పదేళ్ల లో బీఆర్ఎస్ చేయలేని అభివృద్ధిని రెండున్నర ఏళ్లలో చేస్తుంటే జీర్ణించుకోలేక ఆవాకులు, చీవాకులు పేలుతున్నారని అన్నారు. ఒక్క ఇంటిని, ఒక్క తెల్లరేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్ నాయకులను ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. లక్షల కార్డులను మంజూరు చేసి ప్రతీ ఒక్కరికి సన్నబియ్యం ను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ దక్కుతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి ఏదైనా రిస్క్ జరిగితే రూ.5 లక్షలు ప్రభుత్వం బీమా ఇస్తుందని అన్నారు. రాబోయే రోజులలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలకు కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడారు...కాంగ్రెస్ ఏ ఒక్కరి చేతిలో బందీగా లేదన్నారు. కష్టపడ్డ ప్రతీ ఒక్కరిని ప్రభుత్వం గుర్తింపు ఇస్తుందన్నారు. సంఘటన, సృజన్ అభియాన్ లో భాగంగా పార్టీకి కట్టుబడి ఉన్న వారికి పదవులు ఇస్తున్నామని అన్నారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు "సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు బూత్, మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ లో పార్టీ నిర్మాణం పై శిక్షణా తరగతులు జరపనున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, జిల్లా నాయకులు దుర్గా ప్రసాద్, కొడాలి గోవిందరావు. వెంకన్న, భద్రయ్య, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, రేగూరి వాసవి, నంబూరి రామారావు, కొత్తపల్లి సుబ్బయ్య, కడియాల నరేష్, పాకనాటి కన్నారెడ్డి, మార్తికోటి, నల్లాని మల్లిఖార్జునావు, వివిధ పంచాయతీల సర్పంచ్ లు బోయిన వేణు, కట్టెకోల నాగార్జున, దుద్దెల పవన్, త్రివేణి పాల్గొన్నారు.

# శ్రీరామనవమి ఉత్సవ కమిటిలో చోటు...!



**నేలకొండపల్లి, మహా:**భద్రాచలం దేవస్థానం వద్ద జరిగే శ్రీరామనవమి వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ ఉత్సవ కమిటిని ఏర్పాటు చేశారు. మొత్తం 14 మందితో ఉత్సవ కమిటిని నియమించారు. 26 నుంచి 29 వరకు కేవలం నాలుగు రోజుల పాటు ఈ పదవిలో ఉంటారని...శ్రీరామనవమి వేడుకలు శాంతియుతంగా జరిగేలా చూడటానికి ఉత్సవ కమిటిని ఏర్పాటు చేశారు. వీరిలో భక్తరామదాసు జన్మస్థలం (నేలకొండపల్లి మండలం) కు ప్రాధాన్యత కల్పించారు. ఇద్దరు కు స్థానం కల్పించారు. నేలకొండపల్లి కి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రతినిధి, కాంగ్రెస్ నాయకులు 'దోసపాటి చంద్రశేఖర్ కు ఉత్సవ కమిటి సభ్యుడు గా నియమించారు. అదే విధంగా మండలం లోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు దండా సత్యనారాయణ ను ఉత్సవ కమిటి సభ్యులు గా నియమించారు. అయితే పార్టీకి విధేయులుగా ఉన్న నాయకులకు గుర్తింపు ఇచ్చారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ హాయంలో నేలకొండపల్లి కి చెందిన వంగవీటి పెద్ద కృష్ణారావు గత 30 ఏళ్ల క్రితం ట్రస్టు సభ్యులు గా పని చేశారు. తాజాగా తరువాత ఇరువురు ను ఉత్సవ కమిటి సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులుగా నియమితులైన దండా సత్యనారాయణ, శేఖర్ లు మాట్లాడారు....శ్రీరామనవమి కళ్యాణ వేడుక ను దగ్గర ఉండి చేయించేందుకు ఉత్సవ కమిటి సభ్యులుగా నియమించిన ప్రభుత్వం కు, మంత్రులకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. వీరి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. రాజేశ్వరపురం లో దండా సత్యనారాయణ ను యువజన కాంగ్రెస్ నాయకులు పగిళ్ల పృథ్వీ, మాజీ ఉప సర్పంచ్ చిట్యాల రమేష్ లు ఘనంగా సన్మానించారు.

# రైతు వ్యతిరేక ప్రభుత్వం పై ఉద్యమం తప్పదు

### కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ కుమార్

**నేలకొండపల్లి, మహా:** రైతు వ్యతిరేక తెలంగాణ ప్రభుత్వం పై క్షేత్ర స్థాయిలో ఉద్యమం తప్పదని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రైతులకు అనేక హమీలు ఇచ్చారని...అధికారం లోకి వచ్చిన తరువాత రైతులను విస్మరించారని ఆరోపించారు. పంటలు చేతికొచ్చినప్పటకీ విక్రయించుకునేందుకు కేంద్రాలు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. దళారులు రైతులు వద్ద వారికి ఇష్టం వచ్చిన ధరలకు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కు బోనస్ తరహా లోనే చెరుకు, మొక్కజొన్న పంటలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతు సమస్యలు పరిష్కరించకుంటే వారి అగ్రహం కు గురికాక తప్పదని హెచ్చరించారు. రైతాంగం వ్యతిరేక విధానాల ను నిరసిస్తూ... దశల వారీగా ఉద్యమాలకు కార్యచరణ ను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పుట్టా సత్యనారాయణ, బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



EDITORIAL సంపాదకీయం

# నియోజకవర్గాల పునర్విభజన ఎవరికి లాభం




నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కేవలం జనాభా లెక్కల సవరణ మాత్రమే కాదు. అది రాజకీయ చదరంగంలో అత్యంత కీలకమైన ఘట్టం. పార్లమెంట్ స్థానాల సంఖ్య పెరగడం అనేది కేంద్రం పరిధిలోని అంశమైనప్పటికీ, రాష్ట్రాల స్థాయిలో అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించే డీలిమిటేషన్ కమిషన్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రభావం గణనీయంగా ఉంటుంది. ఇందుకు గతంలో జరిగిన డీ లిమిటేషన్ ప్రక్రియ, తర్వాత పార్టీలు, వ్యక్తులు, సంఘాల నుంచి వచ్చిన అభ్యంతరాలే సాక్ష్యం. సాంకేతికంగా ఇది స్వతంత్ర ప్రక్రియే అయినా, క్షేత్రస్థాయిలో భౌగోళిక హద్దుల మార్పులు, మండలాల విలీనం వంటి విషయాల్లో అధికార పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదిపే అవకాశం ఉంటుంది. అఫ్ కోర్స్ ఎవరు అధికారంలో ఉంటే వారికి అనుగుణంగా నియోజకవర్గాల ఏర్పాటు, పునర్విభజన చేయడం సహజం కూడా. తమకు పట్టున్న ప్రాంతాలను ఒకే నియోజకవర్గంలోకి చేర్చడం లేదా ప్రత్యర్థి పార్టీల కంచుకోటలను ముక్కలు చేయడం ద్వారా ఎన్నికలకు ముందే సగం విజయాన్ని ఖరారు చేసుకోవచ్చనేది గత అనుభవాలు చెబుతున్న సత్యం.

**నాటి వైఎస్సార్ వ్యూహం – టీడీపీ కంచుకోటల విచ్ఛిన్నం**

గతంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినపుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో టీడీపీకి కంచుకోటలుగా ఉన్న అనేక నియోజకవర్గాల స్వరూపాన్ని విచిత్రంగా మార్చేశారు. నర్సరావుపేట, ప్రత్తిపాడు వంటి నియోజకవర్గాలను చీల్చేసి.. టీడీపీ కంచుకోటల్ని బద్దలు కొట్టారు. ఒక సామాజిక వర్గం బలంగా ఉన్న ప్రాంతాలను చీల్చడం లేదా రిజర్వేషన్ల మార్పుల ద్వారా టీడీపీ సీనియర్ నేతల నియోజకవర్గాలను గాలిలో దీపాలుగా మార్చడంలో వైఎస్సార్ పూర్తి స్థాయిలో సఫలమయ్యారు. దీనివల్ల 2009 ఎన్నికల్లో అనేక చోట్ల టీడీపీ బలమైన అభ్యర్థులు ఉన్నప్పటికీ, భౌగోళిక మార్పుల వల్ల ఓటమి పాలవాల్సి వచ్చింది. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో ఇప్పుడు అదే అవకాశం చంద్రబాబు నాయుడికి రాబోతోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు, ఈసారి ఏపీలో వైసీపీ ప్రాబల్యాన్ని తగ్గించేలా హద్దుల నిర్ణయంలో తన ముద్ర వేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**తెలంగాణలో రేవంత్ కు సవాల్**

ఇక తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఈ డీలిమిటేషన్ ఒక గొప్ప అవకాశం. అయితే, ఇక్కడ ఒక చిక్కు ఉంది. తెలంగాణలో జనాభా పెరుగుదల ఎక్కువగా హైదరాబా, దాని చుట్టుపక్కల ఉన్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే కేంద్రీకృతమై ఉంది. పెరిగే సీట్లలో మెజారిటీ ఈ అర్బన్ ఏరియాల్లోనే ఉండే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో కాంగ్రెస్ అంత బలంగా లేదు. బలం లేదని చెప్పేందుకు 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలే తార్కాణం. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు పట్టు ఉన్నప్పటికీ, అక్కడ సీట్ల సంఖ్య పెద్దగా పెరగకపోవచ్చు. కాబట్టి, పెరిగే కొత్త సీట్లు రేవంత్ రెడ్డికి రాజకీయంగా ఎంతవరకు అడ్వాంటేజ్ ఇస్తాయనేది సందేహమే. హైదరాబాద్ చుట్టుపక్కల హద్దులను ఎలా మార్చినా, అక్కడ ఉన్న పట్టణ ఓటర్ల మొగ్గును బట్టే ఫలితాలు ఉంటాయి తప్ప, కేవలం హద్దుల మార్పుతోనే కాంగ్రెస్ పాగా వేయడం కష్టమని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధితో పాటు పరిసర జిల్లాలలోనే దాదాపు 50 అసెంబ్లీ సీట్లు ఉండే అవకాశం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన కేవలం భౌగోళిక మార్పు కాదు, అది సామాజిక సమీకరణాలను తలకిందులు చేసే ప్రక్రియ. ఏపీలో టీడీపీ తన పాత వైభవాన్ని శాశ్వతం చేసుకోవాలని చూస్తుంటే, తెలంగాణలో రేవంత్ రెడ్డి పెరిగే అర్బన్ సీట్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి కొత్త వ్యూహాలు రచించాల్సి ఉంటుంది.

అయితే ఇప్పటికే ఈ దిశగా ఆయన ప్రయత్నాలను ముమ్మరం చేశారు కూడా. డీలిమిటేషన్ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా ఏ గ్రామాన్ని ఏ నియోజకవర్గంలో కలపాలో నిర్ణయించే సమయంలో జరిగే లాబీయింగ్ రాబోయే దశాబ్ద కాలపు రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతోంది. 2026 డీలిమిటేషన్ అనేది అధికార పార్టీల చేతిలో ఒక శక్తివంతమైన ఆయుధం కాబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. దీనిని చంద్రబాబు ఏపీలో ఎలా వాడుకుంటారు, రేవంత్ రెడ్డి తెలంగాణలో ఎలా ఎదుర్కుంటారు అనేది ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా, ఎవరు అవునన్నా, కాదన్నా రేవంత్‌కు చంద్రబాబు రాజకీయ గురువు, అంతే కాకుండా రాజకీయాలలో ఎత్తు పల్లాలు అంటే ఏమిటి, వాటిని ఎలా ఎదుర్కోవాలి, క్లిష్ట సమయంలో ఏరకంగా వ్యవహరించాలి, ప్రత్యర్థులను ఎలా తన దారికి తీసుకురావచ్చు అన్న అంశాలన్నింటిపైనా చంద్రబాబు దగ్గర రేవంత్ చూసి నేర్చుకున్నారు. గురువు నేర్పిన విద్యను ఇప్పుడు తనకు అనుకూలంగా మార్చుకుంటారా అన్నది కూడా ఆసక్తిగా మారింది. రాబోయే అయిదేళ్ళు కూడా నేనే సీఎం అంటున్న రేవంత్ వ్యాఖ్యల వెనుక తన వద్ద ఉన్న మాస్టర్ ప్లానే కావచ్చునన్న చర్చ కూడా జరుగుతోంది. 2023 అసెంబ్లీ న్నికల్లో కాంగ్రెస్ లోని రాజకీయ ఉద్దండులను వెనక్కు నెట్టి తన పంతాన్ని నెగ్గించుకుని సీఎం పీఠాన్ని అధిష్టించిన రేవంత్ రెడ్డి మరోసారి తన వ్యూహమెంటో ఇటు విపక్షాలకు, అటు స్వపక్షంలోని సీనియర్లకు కూడా చూపించి తాననుకున్నట్లు రెండుసారి సీఎం పీఠాన్ని అధిష్టిస్తే అదంతా చంద్రబాబు దగ్గర నేర్చుకున్న రాజకీయ చాతుర్యమేనని భావించాల్సిందే.



-గడ్డం కృష్ణమూర్తి
అసోసియేట్ ఎడిటర్, మహా పత్రిక

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**

mahaapatrika@gmail.com

whatsapp: 74369 39999

# గుండెల్ని పిండేస్తున్న మార్కాపురం మహా విషాదం



(మహా ప్రత్యేకం)

చీకటిని చీల్చుకుంటూ నెమ్మదిగా సాగుతున్న ఆ బస్సులో...అలసిపోయి నిద్రపోతున్న వారి కళ్లలో ఎన్నో కలలు. రేపు ఉదయం గమ్యం చేరాక, నాలుగు రాళ్లు సంపాదించి తమ కుటుంబాల అప్పులు తీర్చాలన్న తపన. కానీ, ఆ కలలన్నీ ఆ చీకట్లోనే బూడిదైపోయాయి. గమ్యం చేరకముందే మృత్యువు టిప్పర్ లారీ రూపంలో ఎదురొచ్చి వారి ఊపిరి తీసేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద గురువారం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం రెండు రాష్ట్రాలను కన్నీటి సంద్రంలో ముంచేసింది. ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ప్రైవేటు బస్సు ఢీకొట్టిన క్షణాల్లోనే.. డీజిల్ ట్యాంక్ పేలిపోయి బస్సంతా అగ్నికీలలు చుట్టుముట్టాయి. కళ్లు తెరిచి, ప్రాణాలు రక్షించుకునేలోపే 13 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ ఘోరకలిలో కాలిపోయిన ప్రతి మృతదేహం వెనుకా....గుండెల్ని పిండేసే ఒక కన్నీటి గాథ దాగి ఉంది.

**చితిగా మారిన బస్సు... శిథిలమైన బతుకులు**

తెలంగాణలోని నిర్మల్ నుంచి నెల్లూరు జిల్లా పామూరు వైపు బయలుదేరిన హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన (AR20D0487) ప్రైవేటు బస్సులో మొత్తం 41 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా జగిత్యాల, కోరుట్ల ప్రాంతాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు, సుతారీ పనివారు. తమ సొంత ఊర్లో పనులు దొరక్క, పొట్టకూటి కోసం ఆంధ్రాలోని కనిగిరి, పామూరు, కలిగిరి, వింజమూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. పరుల కోసం అందమైన ఇళ్లు కట్టే ఆ అభాగ్యులు.. మంటల్లో చిక్కుకుని బూడిద కుప్పలుగా మారిపోవడం కలచివేస్తోంది. ప్రమాదం జరిగిన తీరు అత్యంత భయానకమైనది. మార్కాపురం సమీపంలో చీమకుర్తి నుంచి కంకర్ లోడుతో వస్తున్న టిప్పర్‌ను బస్సు అతివేగంగా ఢీకొట్టింది. ఆ ధాటికి ముందు భాగం నుజ్జునుజ్జయి, డీజిల్ ట్యాంక్ పేలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు ఏం జరుగుతుందో తెలిసేలోపే బస్సంతా నిప్పుల కొలిమిగా మారింది. మంటల వేడికి, పొగకు ఊపిరి ఆడక ప్రయాణికులు చేసిన ఆర్తనాదాలు ఆ అర్ధరాత్రి నిశ్శబ్దాన్ని బద్దలుకొట్టాయి. మంటలను గమనించిన ఓ 10 మంది ప్రయాణికులు అద్దాలు పగలగొట్టుకుని కిందకు దూకేసి ప్రాణాలు దక్కించుకున్నారు. కానీ మిగిలిన వారిని ఆ రాక్షస మంటలు వదల్లేదు. కళ్లెదుటే తమ ఆత్మీయులు కాలిపోతున్నా.. అగ్నికీలల ధాటికి వారిని కాపాడుకోలేని నిస్సహాయతలో మిగిలిపోయిన వారి ఆర్తనాదాలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి. ఈ ప్రమాదంలో అత్యంత హృదయ విదారకమైన దృశ్యం ఐదు నెలల పసికందు అంబటి లియో మరణం. లోకం పోకడ తెలియని ఆ చిన్నారి.. తండ్రి అంబటి అనిల్ (26) చేతుల్లోనే అగ్నికి ఆహుతైపోయాడు. మంటలు అంటుకున్నప్పుడు తన బిడ్డను కాపాడుకునేందుకు ఆ తండ్రి పడిన తపన, చేసిన పోరాటం బహుశా ఆ దేవుడిని కూడా కదిలించి ఉండాలి. కానీ మంటల తీవ్రత ఆ తండ్రీకొడుకులను బూడిద చేసింది. వీరే కాకుండా బండారి పద్మ (28), ముత్తంగి వెంకటేశ్వర్లు (45), తమ్మశెట్టి పిచ్చమ్మ, తమ్మిశెట్టి రుక్మిణి, ఉప్పు రమాదేవి, పొదిలి మహేంద్ర, ఎన్.ప్రభావతి (36), కత్తి జయరాములు, ఆత్మకోరు చిన్న, దేవేంద్ర రామయ్య, చైత్ర, జ్యోతి.. ఇలా మొత్తం 14 మంది నిండు ప్రాణాలు ఈ అగ్నిప్రళయంలో కలిసిపోయాయి. కాలిపోయిన మృతదేహాలు ఏవి ఎవరివో గుర్తుపట్టలేనంత దారుణంగా మారిపోయాయి. ఎముకల గూళ్లుగా మారిన ఆ దేహాలను చూసి బంధువులు గుండెలు బాదుకుంటున్నారు. గాయపడిన మరో 28 మందిని హుటాహుటిన మూడు అగ్నిమాపక యంత్రాల సాయంతో కాపాడి, మార్కాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో చాలా మంది తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘోర ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున కేంద్రం పరిహారం ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. మంత్రులు నారా లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బాధితులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఒక పూట గడిస్తే చాలనుకునే పేదల బతుకులపై పగిలిన ఈ మృత్యు పిడుగు.. ఆ కుటుంబాల్లో ఎన్నటికీ తీరని శోకాన్ని మిగిల్చింది. ప్రభుత్వం ఇచ్చే లక్షల రూపాయల పరిహారం, ఆ కుటుంబాల్లో ఆరిపోయిన దీపాలను మళ్లీ వెలిగించలేవు. ఆత్మీయులను కోల్పోయిన ఆ కుటుంబాల రోదనలు ఎప్పటికీ ఆగిపోవు. రహదారులపై నెత్తుటి మరకలు, బూడిద కుప్పలుగా మారుతున్న బస్సులు.. రవాణా భద్రతపై ఇంకెన్ని ప్రశ్నలు సంధిస్తాయో కాలమే సమాధానం చెప్పాలి.

# ధరణి కష్టాలకు చెక్ పడుతుందా?



సొంత భూమికి పట్టా ఉన్నా.. పాస్ బుక్ చేతిలో ఉన్నా.. ఆ భూమి నాదే అని నిరూపించుకోవడానికి రైతులు పడిన యాతన అంతా ఇంతా కాదు. చిన్న సాంకేతిక లోపం వల్ల ఒకరి భూమి మరొకరి పేరు మీదకు మారడం, ఏళ్ల తరబడి తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరిగినా పరిష్కారం దొరకకపోవడం.. ఇదీ గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో 'ధరణి' పోర్టల్ సృష్టించిన కల్లోలం. ఈ కన్నీటి గాథలకు, భూ వివాదాలకు శాశ్వత చరమగీతం పాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. రెవెన్యూ, సర్వే, స్టాంపులురిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే గొడుగు కిందకు తెస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్'ను రూపొందించింది. అసెంబ్లీ వేదికగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేసిన ఈ ప్రకటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతుల్లో ఆశల పల్లవిని మోగిస్తోంది. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఈ నూతన పోర్టల్ రాష్ట్రంలో అడుగుపెట్టబోతోంది. ఒక రైతు తన ప్రాణానికి సమానంగా చూసుకునేది తన భూమిని మాత్రమే. అలాంటి భూమి రికార్డుల్లో తప్పులు దొర్లితే, ఆ అన్నదాత పడే మానసిక క్షోభ వర్ణనాతీతం. గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్, సామాన్యులకు ఒక పీడకలగా మిగిలిపోయిందన్నది పచ్చి నిజం. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా భూ సమస్యలు పరిష్కారం కాక ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల దీనగాథలు ఎన్నో చూశాం. ఈ వ్యవస్థాగత లోపాలను సమూలంగా ప్రక్షాళన చేయాలన్న ఉక్కు సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్'కు రూపకల్పన చేసింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో అసెంబ్లీలో సుదీర్ఘంగా సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఈ ఏప్రిల్ 2 నుంచి భూభారతిని ప్రజలకు పరిచయం చేయబోతున్నట్లు ప్రకటించడం రెవెన్యూ ప్రక్షాళనలో ఒక చారిత్రక ఘట్టం.

ఈ మహాక్రతువును ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసి పాత తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. తొలిదశలో కేవలం ఐదు మండలాల్లో మాత్రమే ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్ట్) ఈ భూభారతి పోర్టల్‌ను అమలు చేయనున్నారు. కోస్గి, అమన్‌గల్, వట్పల్లి, కుసుమంచి, అశ్వారావుపేట మండలాలను ఇందుకోసం ఎంపిక చేశారు. ఈ ఐదు మండలాల్లో పోర్టల్ పనితీరును నిశితంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో వచ్చే సాంకేతిక ఇబ్బందులను, రైతుల సందేహాలను పూర్తిగా నివృత్తి చేసిన తర్వాతే రాష్ట్రవ్యాప్తంగా మహా విస్తరణకు శ్రీకారం చుట్టనున్నారు. ఎక్కడో ఏసీ గదుల్లో కూర్చుని నిర్ణయాలు తీసుకోవడం కాకుండా, క్షేత్రస్థాయి వాస్తవాలను బేరీజు వేసుకుంటూ రైతుల భూములకు రక్షణ కవచంలా భూభారతిని తీర్చిదిద్దుతున్నారు.

అసలు ఈ 'భూభారతి' ప్రత్యేకత ఏమిటంటే.. ఇది మూడు కీలక శాఖల మహా సంగమం. గతంలో రెవెన్యూ రికార్డులు ఒకలా ఉంటే, సర్వే రికార్డుల్లో కొలతలు మరోలా ఉండేవి. రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ఇంకో లెక్క ఉండేది. ఈ సమన్వయ లోపమే భూమాఫియా పాలిట వరంగా, పేద రైతుల పాలిట శాపంగా మారింది. ఇప్పుడు భూభారతి పోర్టల్‌లో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగాల సమగ్ర సమీకరణ జరుగుతుంది. అంటే ఒక భూమికి సంబంధించిన సమగ్ర జాతకం, అంగుళం కొలతలతో సహా పక్కాగా ఒకే పోర్టల్‌లో దర్శనమిస్తుంది. దీనివల్ల నకిలీ రిజిస్ట్రేషన్లకు, డబుల్ రిజిస్ట్రేషన్లకు, భూకబ్జాలకు శాశ్వతంగా చెక్ పడుతుంది. భూవివాదాలను జీరో స్థాయికి తీసుకురావడమే లక్ష్యంగా సిద్ధమైన ఈ పోర్టల్, తరతరాలుగా వస్తున్న రైతుల భూములకు అసలైన శ్రీరామరక్షగా నిలవబోతోంది.



- దామరపల్లి నర్సింహారెడ్డి,
95813 58696

## సింగరేణి ఇల్లందు క్లబ్ లో మహిళా దినోత్సవ వేడుకలు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**కొత్తగూడెం ఇల్లందు క్లబ్ లో గురువారం సింగరేణి కార్పొరేట్ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిధిలుగా ఎల్.మాలతి సూర్యనారాయణ, కే.విజయ వెంకటేశ్వర్లు, ఏసిఎంఓ డాక్టర్ ఎం.ఉష పాల్గొని మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి వారి అమూల్యమైన సందేశాన్ని వివరించారు. ఈ సృష్టిలో స్త్రీ శక్తిని మించినది ఏమి లేదని పేర్కొన్నారు. మహిళలు స్వయంకృషితో ఎదిగి కుటుంబ పోషణ, స్త్రీ ఆరోగ్య సంరక్షణలో ఎలా శ్రద్ధ తీసుకోవాలో తెలియచేశారు. అనంతరం ముఖ్యఅతిధి హాజరైన గారైన ఏఎంఓ ఎం.ఉషను లేడీస్ క్లబ్ సభ్యులు సన్మానించారు. లేడీస్ క్లబ్ మహిళలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ఎల్. మాలతి సూర్యనారాయణ, కే.విజయ వెంకటేశ్వర్లు, ఏసిఎంఓ డాక్టర్ ఎం.ఉష, కమిటీ సభ్యులు మీనాక్షి, అరుణ, పార్వతి, మాధవి, లక్ష్మీ, మధులత లేడీస్ క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తి సాధనలో అగ్రగామిగా నిలిచిన సత్తుపల్లి ఏరియా జే.వి.ఆర్ ఓ.సి

### ఉత్పత్తికి సహకరించిన ఉద్యోగులకు ఐ.ఎన్.టి.యు.సి యూనియన్ ప్రతినిధుల ప్రశంసలు







**సత్తుపల్లి, మహా:** పట్టణ ప్రాంతంలోని జలగం వెంగళరావు ఉపరితల గని బొగ్గు ఉత్పత్తి సాధనలో అగ్రగామిగా నిలిచింది. సింగరేణి సత్తుపల్లి ఏరియాగా ఏర్పడిన కొద్దిరోజులకి 144 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి 110 శాతం ఉత్పత్తి శాతాన్ని సాధించింది. ఈ సందర్భంగా ఐ.ఎన్.టి.యు.సి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు ఉత్పత్తి సహకరించిన ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్, జే.వి.ఆర్ ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ప్రహ్లాద్, కిష్టారం ప్రాజెక్టు ఆఫీసర్ సునీల్ వర్మకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ జలగం వెంగళరావు ఉపరితల గని సిబ్బంది ఏడు రోజుల పని దినాలు మిగిలి ఉండగానే వార్షిక లక్ష్యానికి మించి 144 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించడం అరుదైన ఘనత అని, రానున్న రోజుల్లో భద్రత, నాణ్యత ప్రమాణాలతో కూడిన లక్ష్యాన్ని సాధించింది సంస్థ ఉనికిని కాపాడాలని ఏరియా ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐ.ఎన్.టి.యు.సి యూనియన్ తరపున కార్మిక కుటుంబాలకు అభినందనలు తెలిపారు.

## భద్రాచలంలో శ్రీరామనవమి వేడుకలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

- డ్రోన్ కెమెరాలు సీసీటీవీల పర్యవేక్షణలో భద్రాచలం పట్టణం
- భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా 2000 మంది పోలీసులతో ప్రత్యేక నిఘా
- ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన చర్యలు
- భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి మహా:** భద్రాచలంలో శుక్రవారం జరగనున్న శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం, శనివారం జరగనున్న పట్టాభిషేకం మహోత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. కళ్యాణ మహోత్సవ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్ల గురించి గురువారం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రత్యేక బృందాలతో పటిష్టమైన నిఘా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. సుమారుగా రెండు వేల మంది పోలీసులతో ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భక్తుల కొరకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ఆన్లైన్ లింకును రూపొందించడం జరిగిందని తెలిపారు. భద్రాచలం పట్టణం మొత్తం డ్రోన్ కెమెరాలు, సీసీటీవీలతో నిరంతర పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు. భద్రాచల పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ రెండు రోజులపాటు పోలీసు వారు విధించే ట్రాఫిక్ ఆంక్షలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు.

## మంత్రిచే కంటి ఆపరేషన్ల బ్రోచర్ విడుదల..

- ఒకే సంవత్సరంలో 1628 శస్త్రచికిత్సలు
- మణుగూరులో రికార్డు



**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా కంటి ఆపరేషన్లకు సంబంధించిన ప్రత్యేక బ్రోచర్ సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో విడుదలైంది. ఈ కార్యక్రమాన్ని మణుగూరు ఆప్తాల్మిక్ ఆఫీసర్ జి సంజీవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఖమ్మం జిల్లా కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పారా మెడికల్ సర్వీసెస్ డిప్యూటేషన్‌పై మణుగూరు ఏరియా ఆసుపత్రికి వచ్చిన జి సంజీవరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో సేవలు అందిస్తూ విశేష ఫలితాలు సాధించారు. ఆయన కృషితో గత ఒక సంవత్సర కాలంలో మొత్తం 1628 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించడం విశేషం.ఈ శస్త్రచికిత్సలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖ, పుష్పగిరి ఐ ఆసుపత్రి, వైద్య ఆరోగ్యశాఖ, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎంహెచ్ఓ అండ్ డీసీఎచ్ఎస్ డాక్టర్ రవిబాబు పూర్తి సహకారం అందించడంతో ఈ కార్యక్రమం సాఫీగా సాగి రికార్డు స్థాయిలో శస్త్రచికిత్సలు చేయడం సాధ్యమైనట్లు ఆప్తాలమి ఆఫీసర్ సంజీవరావు ఈ సందర్భంగా తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైద్య సిబ్బంది కృషిని ప్రశంసిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాప్‌లు లేక బీజాపూర్ రోడ్డుపైన ప్రయాణికుల ఇక్కట్లు

- హైదరాబాద్ బీజాపూర్ రోడ్డు పూర్తయ్యేవరకు తాత్కాలిక బస్టాప్లు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్
- బస్సుల కోసం రోడ్డుపైనే ప్రయాణికుల పడిగాపులు
- మండుటెండలో అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- ఆర్టీసీ అధికారుల తీరుపై ఆగ్రహం



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ చౌరస్తా లోని బస్సు ప్రయాణికులకు ఇబందికరంగా మారింది. కూర్చోవడానికి కుర్చీల మాటటుంచితే కనీసం నిలబడేందుకు నిలువనీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వానకు తడుస్తూ, వేసవి కాలంలో చెమటలు పడుతున్నా బస్సుల కోసం మండుటెండలో ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బస్సు చార్జీలను ముక్కుపిండి వసూలు చేస్తున్న ఆర్టీసీ యాజమాన్యం.. ప్రయాణికులకు కనీస వసతులు కల్పించడంలో మాత్రం అలసత్వం వహిస్తోంది. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రయాణికులతో నిత్యం రద్దీగా..

ప్రధానంగా విద్యాసంస్థలు ఉన్న హిమాయత్ నగర్ అజీజ్ నగర్ జెబిఐటి బస్టాప్ నుండి ఇతర ప్రాంతాలకు వందలాది మంది ప్రయాణికులు ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు ఉదయం నుంచి రాత్రి వరకు బస్టాప్ నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం ఇక్కడికి వస్తుంటారు. నిత్యం ప్రయాణికులతో ఈ జంక్షన్లు రద్దీగా ఉంటోంది. ఆర్టీసీ బస్సుల కోసం కుటుంబంతో కలిసి బస్టాప్కు వచ్చిన వారు రోడ్డు పక్కన, స్థానిక దుకాణాల నీడన నిలబడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దివ్యాంగులు, చిన్నపిల్లలతో పాటు వృద్ధుల అవస్థలు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రోడ్డుపై నిల్చోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### రోడ్డు దాటాలంటే భయమే

హైదరాబాబ్ బీజాపూర్ రోడ్డు దాటడం అంత సులువేం కాదు. బస్సుల కోసం రోడ్డుపై ఎదురు చూస్తున్న సమయంలోనే కాకుండా బస్సు దిగి రోడ్డు దాటే సమయాల్లో ప్రమాదాలకు గురికావడం ఇక్కడ సర్వసాధారణమే అంటున్నారు. ప్రయాణికులు రోడ్డు పక్కన నిల్చోవడమే కాకుండా బస్సులు నిలిపేందుకు స్థలం లేకపోవడం గమనార్హం. హైదరాబాద్ నుండి చేవెళ్ల వైపు వెళ్ళే బస్సులు చేవెళ్ల వికారాబాద్ నుండి హైదరాబాద్ వెళ్ళే బస్సులు సైతం నడిరోడ్డుపైనే నిలపాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డుపైన నిలిపిన బస్సుల నుంచి ప్రయాణికులు దిగి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రోడ్డు దాటడం ప్రమాదకరంగా మారింది. హిమాయత్ నగర్ చౌరస్తా నుండి చిన్నమంగళారం వైపు ఆర్టీసీ ప్రయాణం కష్టంగా మారింది. చిలుకూరు రెడ్డిపల్లి చిన్నమంగళారం మేడిపల్లి వైపు ఆర్టీసీ బస్సుల కోసం గంటలు తరబడి రోడ్డుపై వేచిచూడాల్సిన పరిస్థితులు కనపడుతున్నాయి. ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళ్లిరావడానికి సమయానికి బస్సులు లేక ప్రయాణికులు చాలా ఇబ్బందికరంగా ఉందనీ చెప్తున్నారు.బస్సుల సంఖ్య పెంచి సమయానికి బస్సులు నడిపే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని అజీజ్ నగర్ చౌరస్తా హిమాయత్ నగర్ చౌరస్తా జెబిఐటి వద్ద హైదరాబాద్ బీజాపూర్ రోడ్డు పూర్తయ్యేవరకు తాత్కాలిక బస్టాప్ ఏర్పాటు చేసి ప్రయాణికుల బాధలను తీర్చాలని కోరుకుంటున్నారు

## మూడు రోజులపాటు కస్టడీ పూర్తి కావడంతో డ్రగ్స్ కేసు నిందితులను కోర్టులో హాజరు

### కోర్టు నుంచి చంచల్ గూడా జైలుకు తరలింపు



**రాజేంద్రనగర్, మహా :** మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీ ముగియడంతో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను పోలీసులు గురువారం రాజేంద్రనగర్ కోర్టులో హాజరు పరిచారు. ఈనెల 23న కోర్టు ఆదేశాల మేరకు కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, విచారణ అనంతరం రాజేంద్రనగర్ కోర్టులో ప్రవేశపెట్టారు.మూడు రోజుల పాటు కస్టడీలో సేకరించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు.అనంతరం కోర్టు ఆదేశాలతో నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు.ఈ కేసులో నిందితులకు ఏప్రిల్ 8 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

## బూర్గంపాడు మండల అభివృద్ధి నోచుకోకపోవడంపై సీపీఎం పార్టీ ఆందోళన



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండల అభివృద్ధి నోచుకోకపోవడంపై సీపీఎం పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. గోదావరి వరదల కారణంగా మండలంలోని నాగినేనిపోలు, రెడ్డిపాలెం, సారపాక తదితర గ్రామాలు ప్రతి సంవత్సరం నీటమునిగిపోతున్నాయని పార్టీ నేతలు పేర్కొన్నారు.సీపీఎం బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో మాట్లాడుతూ, వరదల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పంటలు పూర్తిగా దెబ్బతింటున్నప్పటికీ, గత ప్రభుత్వం సరైన నష్టపరిహారం ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు.భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో, ఆయన ఈ ప్రాంత అభివృద్ధిపై కూడా దృష్టి సారించాలని కోరారు. భద్రాచలం మాత్రమే కాకుండా, సమీపంలోని సారపాక, బూర్గంపాడు ప్రాంతాల అభివృద్ధి కూడా సమానంగా జరగాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ ప్రాంతంలో పెద్ద పారిశ్రామిక సంస్థలు ఉన్నప్పటికీ, స్థానిక ప్రజలకు ప్రయోజనం కలగడం లేదని, పైగా కాలుష్యం వల్ల ప్రజలు గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి సమస్యలతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల, ఇక్కడి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అలాగే, గోదావరి వరదల నుంచి రక్షణ కోసం కరకట్టలు నిర్మించాలని, వరద ప్రభావిత గ్రామాలు మరియు రైతులకు తక్షణ సహాయం అందించాలని కోరారు. ముఖ్యమంత్రి ఈ ప్రాంత సమస్యలను పరిగణనలోకి తీసుకుని, అభివృద్ధికి సంబంధించిన స్పష్టమైన ప్రకటనలు చేయాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం బూర్గంపాడు మండల కమిటీ డిమాండ్ చేసింది.

## దక్షిణ అయోధ్యలో భక్తులకు పూర్తి సౌకర్యాలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాచలం మహా :** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం "దక్షిణ అయోధ్య"గా ప్రసిద్ధి చెందినదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.మిథిలా స్టేడియంలో జరుగనున్న శ్రీ సీతారాముల వారి కళ్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు హాజరవుతారని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా, ఈరోజు ఉదయం 10:30 నుంచి 12:30 వరకు శ్రీ సీతారాముల వారి కళ్యాణం, మార్చి 28న అదే సమయాల్లో మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## తై బజార్ బహిరంగ వేలంలో 17 లక్షల 35 వేల 150 రూపాయల దక్కించుకున్న కళ్లెం అంజయ్య



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జోన్ పరిధిలోని తై బజార్ 202627 వరకు జిహెచ్ఎంసి శంషాబాద్ కార్యాలయంలో వేలం పాట గురువారం నిర్వహించారు.డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ వేలంపాటలో 7 మంది పాల్గొన్నారు. అందులో కళ్ళెం అంజయ్య 17 లక్షల ముప్పై ఐదు వేల 150 రూపాయలకు వేలంపాటలో తైబజార్ ను దక్కించుకున్నారు. వేలంలో ఎస్టేట్ ఆఫీసర్ టీ పర్వతాలు, ఏఎంసీ శ్యాంసుందర్, జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్ పాత్ ఆక్రమణలపై జిహెచ్ఎంసి, హైడ్రా అధికారుల కొరడా..



**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి నుండి ఆరంఘర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా పుట్ పాత్‌లను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను గురువారం హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులు సంయుక్తంగా నిర్మాణాలను జెసిబి సాయంతో నేలమట్టం చేశారు.అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌లో అధికారులు దృష్టి సారించి, భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఫుట్ పాత్ ఆక్రమణలతో పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తుంది, ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాదచారులకు ఫుట్ పాతులపై నడిచే వీలు కల్పించారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ హాస్టల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు



**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా వ్యాపితగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ లలో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలిని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్లో పనిచేసే కార్మికులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిపానుగంటి పర్వతాలతో గురువారం శంషాబాద్ లోసమావేశం అయ్యారు.సమావేశంలో ప్రభుత్వ హాస్టల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను అసెంబ్లీలో కొత్తగూడెం శాసనసభ్యులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చర్చించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలని కోరారు.

## బీజేపీ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి-మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా :** అసెంబ్లీ లో ఇందిరా గాంధీపై బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు.నిండు సభలో మహిళను అవమానపరిచే విధంగా మాట్లాడటం సరికాదని మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనూష అన్నారు. గురువారం ఆదిలాబాద్ DCC కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలతో కలిసి మాట్లాడారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప నాయకురాలిని విమర్శించడం బీజేపీ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ఎమ్మెల్యే వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హౌస్ కీపర్లను జేపీఏగా మార్చాలి..

### బిటిపిఎస్ సీఇకి కార్మిక సంఘం వినతి..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు బీటీపీఎస్‌లో పనిచేస్తున్న హౌస్ కీపర్లు, ఆఫీస్ సబార్డినేట్లను జూనియర్ ప్లాంట్ అటెండెంట్లుగా మార్చాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కర్మాగార చీఫ్ ఇంజనీర్ బి బిచ్చన్నను కలిసి వినతిపత్రం సమర్పించారు.గురువారం బీటీపీఎస్‌లో కార్మిక సంఘం ప్రాంతీయ అధ్యక్షుడు వి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్ రామచంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులు ఏ వెంకటేశ్వర్లు, సిద్దుల హుస్సేన్ తదితరులు చీఫ్ ఇంజనీర్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. భూనిర్వాసితుల కోటా కింద 2021 సంవత్సరంలో హౌస్ కీపర్లు, ఆఫీస్ సబార్డినేట్లుగా విధుల్లో చేరిన వారికి ఐదేళ్ల సేవ పూర్తి కావస్తోందని తెలిపారు. ప్రస్తుతం కర్మాగారంలో జూనియర్ ప్లాంట్ అటెండెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నందున వీరికి మార్పిడి కల్పించాలని కోరారు. అలాగే బీటీపీఎస్‌లో పనిచేస్తూ ఇతర విద్యుత్ కేంద్రాలు, విద్యుత్ సౌధకు బదిలీ కావాలని దరఖాస్తు చేసుకున్న కార్మికుల అభ్యర్థనలను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి పంపించాలని పరిపాలన విభాగం ఉన్నతాధికారి మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. అనారోగ్య కారణాలతో కొందరు కార్మికులు మెరుగైన వైద్య సదుపాయాలు ఉన్న ప్రాంతాలకు బదిలీ కోరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వర్కింగ్ అధ్యక్షుడు తాటి ముత్యాలరావు, తుంపురి అనిల్, నాయకులు కే వీరబాబు, మహ్మద్ జమీల్, పి రమేష్, ఐ నరసింహారావు, జె నరసింహారావు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

### మంగువాయి బాడవ ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన డిడి అశోక్ కుమార్..



**మహా,దుమ్ముగూడెం:** మండల పరిధిలోని మంగువాయి బాడవ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను భద్రాచలం ఐటిడి ఏ డి డి అశోక్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను పరిశీలించిన ఆయన పదవ తరగతి విద్యార్థినిలతో పరీక్షల గురించి మాట్లాడారు. అనంతరం మెనూ చార్ట్ ని పరిశీలించిన ఆయన వంట ప్రదేశానికి వెళ్లి మెనూ ప్రకారం వంటలు వండుతున్నారా? లేదా? అన్న విషయాన్ని అడిగి తెలుసుకుని వండిన వంట పాత్రలపై ఓపెన్ చేయమని అడగ్గా వంట పాత్రలపై మూతలు ఎంతకీ తీయకపోవడంతో కొంత అసహనానికి గురైన డిడి కార్మికులపై మండిపడుతూ వంకాయ, పప్పు కూర, రసమును పరిశీలించారు. సిక్ రూమ్ లో ఉన్న బాలిక గల అనారోగ్య కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో సరైన మెనూ పాటించడం లేదని మండిపడ్డారు. పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తరగతి గదులను పరిశీలిస్తూ ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. ఒకసారి పాఠశాలకు వచ్చిన డిడిని పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది ఆయనకు శాలువా కప్పి మెమొంటో అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఈ భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు ఎన్. సత్యనారాయణ, ఎం శ్రీనివాసరావు, పార్వతి, రాజేశ్వరి, రవి, రమేష్, పీఈటి పార్వతి, పాఠశాల ఏఎన్ఎం సరిత సిబ్బంది పాల్గొన్నారు.

## మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల పరిష్కార హాల్ నిర్మాణం..

- సింగరేణి సిఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలు..
- తొలి విడతగా జిల్లా ఎస్పీకి రూ.25 లక్షల చెక్కు అందజేత..



**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా సమాజ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణలో కీలక పాత్ర పోషిస్తున్నదని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మణుగూరులో కౌన్సెలింగ్ అండ్ ఫిర్యాదుల పరిష్కార హాల్ నిర్మాణానికి మొత్తం రూ.50 లక్షల సి ఎస్ ఆర్ నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ అమలు కోసం సింగరేణి సంస్థ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిన నేపథ్యంలో, మంజూరైన నిధుల్లో భాగంగా తొలి విడతగా రూ.25 లక్షల చెక్కును జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పి రోహిత్ రాజుకు సింగరేణి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ గురువారం అందజేశారు. ఈ హాల్ నిర్మాణం ద్వారా ప్రజలకు ఆధునిక సదుపాయాలతో ఫిర్యాదులు నమోదు చేసుకునే వీలుతో పాటు, ప్రాథమిక వసతులు ముఖ్యంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ సేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు ఇది అనుకూల వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ కార్యకలాపాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, ఈ తరహా సామాజిక మౌలిక వసతులు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. ఈ హాల్ ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసి వేగంగా పరిష్కారం పొందే అవకాశం కలుగుతుందని చెప్పారు. పనుల పురోగతిని సంస్థ నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందజేస్తుందని వివరించారు. నిధుల వినియోగం, ఖర్చుల వివరాలు, పనుల పురోగతి తదితర అంశాలు సంబంధిత అధికారుల పర్యవేక్షణలో ఉంటాయని, వినియోగ ధృవపత్రాలు మరియు ఆడిట్ ప్రక్రియలు కచ్చితంగా అమలు చేయబడతాయని తెలిపారు. పనులు పూర్తయిన అనంతరం ఆస్తి నిర్వహణ బాధ్యత ప్రభుత్వ శాఖదేనని స్పష్టం చేశారు. చెక్కును స్వీకరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, డీజీఎం సివిల్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదాలను నివారించడమే పోలీసుల లక్ష్యం

- రోడ్డు భద్రతపై పోలీసుల ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్ " కార్యక్రమం
- మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ వెల్లడి

**మంచిర్యాల, మహా :** రోడ్డు ప్రమాదాలను నివారించడమే పోలీసుల లక్ష్యమని మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ స్పష్టం చేశారు. గురువారం చెన్నూరు పట్టణంలో చెన్నూరు పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై "అరైవ్ అలైవ్ " కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు కంటి చూపు మందగిస్తే ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. ఆ ప్రమాదాలను నివారించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్ " కార్యక్రమాన్ని ఉచితంగా చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరైన 150 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి 24 మందికి కంటి అద్దాలు 5 గురికి కంటి శస్త్ర చికిత్స కు ఎంపిక చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ బన్సీలాల్ లు ఎస్సైలు ఇతర సిబ్బంది ఉన్నారు.

**గాంధీ చౌక్‌లో "చలి వేంద్రం" ప్రారంభం**

వేసవి కాలంలో ప్రజల దప్పిక తీర్చేందుకు గాంధీ చౌక్ వద్ద డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లులు చలి వేంద్రంను ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రజలు, బాటసారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

## చెడు వ్యసనాలు వీడండి చదువుపై దృష్టి పెట్టండి!

- మైనర్ బాలురు తల్లిదండ్రులకు ఎస్ఐ వై. సైదులు కౌన్సిలింగ్..
- అభినవ్ స్టేడియం సమీపంలో పట్టుబడ్డ వైనం..
- నిఘా ఉంచాలని తల్లిదండ్రులకు సూచన..



**నల్గొండ, మహా :** మైనర్ బాలురు దురలవాట్లకు లోనై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నల్గొండ టూ టౌన్ ఎస్ఐ వై. సైదులు హితవు పలికారు. పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియం సమీపంలో కొంతమంది మైనర్లు సిగరెట్లు సేవిస్తూ చెడు మార్గంలో వెళ్తున్నారన్న సమాచారంతో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టుబడ్డ బాలురకు, వారి తల్లిదండ్రులకు స్టేషన్‌లో ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. స్టేడియం పరిసరాల్లో మైనర్లు సిగరెట్లు సేవిస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదుతో ఎస్ఐ ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు తనిఖీలు చేపట్టారు. అక్కడ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న బాలురను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి ఎస్ఐ సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు.

**భవిష్యత్తుపై అవగాహన..**

ఈ సందర్భంగా ఎస్ఐ సైదులు మాట్లాడుతూ.. చిన్న వయసులో సరదాగా మొదలయ్యే అలవాట్లు వ్యసనాలుగా మారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశలో చదువుపై ఏకాగ్రత వహించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి. స్నేహితుల ప్రభావంతో తప్పుడు మార్గంలో వెళ్తే జీవితాంతం పశ్చాత్తాపపడాల్సి వస్తుంది అని బాలురను హెచ్చరించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం కన్నేసి ఉంచాలని ఎస్ఐ సూచించారు. వారు ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరితో స్నేహం చేస్తున్నారు? అనే విషయాలను గమనించాలన్నారు. పిల్లలకు ఇచ్చే పాకెట్ మనీ విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. చిన్నపిల్లలకు సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించే దుకాణదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు. పట్టణంలో ఎక్కడైనా మైనర్లు చెడు అలవాట్లకు లోనవుతున్నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. ఆరోగ్యకరమైన, నేరరహిత సమాజ స్థాపనే పోలీసుల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## మృతుడి కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి భరోసా..

**లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేత పిల్లల చదువుకు హామీ..**



**నల్గొండ, మహా :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కనగల్ మండల కేంద్రానికి చెందిన ఎటెల్లి పరశురాం కుటుంబానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అండగా నిలిచారు. గురువారం నాడు ఆయన పరశురాం నివాసానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్న మంత్రి, మృతుడి భార్య సంధ్యను మరియు పిల్లలను ఓదార్చారు. తక్షణ ఆర్థిక సహాయం కింద తన వ్యక్తిగత నిధుల నుండి ఒక లక్ష రూపాయల నగదును వారికి అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా పరశురాం పిల్లల భవిష్యత్తు దృష్ట్యా వారి చదువుకు కావాల్సిన పూర్తి సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు పరశురాం మృతి చెందడం అత్యంత బాధాకరం. ఆ కుటుంబం వీధిన పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. పిల్లల చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం తరపున వ్యక్తిగతంగానూ అన్ని విధాలా ఆదుకుంటాం అని పేర్కొన్నారు.

## 2 బిహెచ్‌కే వాణిజ్య సముదాయాల అమ్మకాలు ఆపాలి

**అసెంబ్లీలో ప్రస్తావించాలంటూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి**



**కుషాయిగూడ, మహా :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీల వాణిజ్య సముదాయాలను వేలం ద్వారా విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులు లబ్ధిదారులతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని 16 డబుల్ బెడ్ రూమ్ కాలనీలలో ఉన్న 992 వాణిజ్య సముదాయాలను విక్రయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. కాలనీల నిర్వహణ ఖర్చులను తగ్గించేందుకు, లబ్ధిదారులపై భారం పడకుండా ఉండేందుకు వాణిజ్య సముదాయాలను నిర్మించినట్లు గుర్తుచేశారు. వాటి నుంచి వచ్చే కిరాయిల ఆదాయాన్ని లిఫ్టులు, మెయింటెనెన్స్ తదితర అవసరాలకు వినియోగించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం వాటిని విక్రయిస్తే భవిష్యత్తులో నిర్వహణ ఖర్చులు పూర్తిగా లబ్ధిదారులపై పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల అమ్మకాల ద్వారా వచ్చిన నిధులను అభివృద్ధి పనులకు వినియోగిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అవి త్వరగా ఖర్చు అయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. దీంతో కాలనీల మెయింటెనెన్స్ సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కిరాయిల వసూళ్లలో సమస్యలు ఉన్నాయనే కారణంతో అమ్మకం నిర్ణయం తీసుకోవడం సరికాదని, బకాయిదారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని సూచించారు. అవసరమైతే ప్రతి రెండు లేదా మూడు సంవత్సరాలకు వేలం ద్వారా కిరాయికి ఇవ్వవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో కిరాయిల విలువ పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో అసంపూర్ణంగా ఉన్న పనులను పూర్తి చేయడానికి, మరమ్మత్తుల కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శ్రీనివాసులు, కాప్రా సర్కిల్ కమిటీ సభ్యులు పి.గణేష్, పార్టీ నాయకులు ఎన్.బాబురావు, శ్రీరామ్ నగర్ 2బిహెచ్‌కే కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములు నాయక్, ఉపాధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ఉచిత వైద్య శిబిరం

**384 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ**



**కుషాయిగూడ, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా జమ్మిగడ్డలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (కుషాయిగూడ పీహెచ్ సి ) లో గురువారం భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరానికి నియోజకవర్గ వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ప్రభుత్వం తరపున వివిధ విభాగాలకు చెందిన అనుభవజ్ఞులైన స్పెషలిస్ట్ డాక్టర్లు రోగులకు ఉచితంగా సేవలు అందించారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక నిపుణుల బృందం అందుబాటులో ఉంది. స్త్రీ ప్రసూతి నిపుణులు డాక్టర్ శివరంజని శ్వేత, డాక్టర్ ఎస్. మానస, డాక్టర్ బి. శ్వేత, డాక్టర్ సమీన్, డాక్టర్ చంద్రప్రియ, డాక్టర్ లలితలు గర్భిణీ స్త్రీలకు మరియు ఇతర మహిళలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఆర్థోపెడిక్: ఎముకలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వృద్ధులకు మరియు రోగులకు ఎముకల నిపుణులు వైద్యం అందించారు. పెడియాట్రిషన్లు చిన్న పిల్లల పెరుగుదల, పౌష్టికాహారం మరియు ఇతర ఆరోగ్య సమస్యలను పరీక్షించారు. ఆఫ్తాల్మాలజిస్టులు కంటి చూపును పరీక్షించగా, డెంటల్ వైద్యులు పళ్ల వ్యాధులపై అవగాహన కల్పించి చికిత్స అందించారు. ఉదయం గం. 9 లకు ప్రారంభమైన ఈ శిబిరం మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. కుషాయిగూడ, జమ్మిగడ్డ మరియు పరిసర ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తం 384 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి తెలిపారు.

## విద్యుత్ ఆర్టిజన్ల 'మహాధర్నా' విజయవంతం..

**I ఏప్రిల్ 8 నుంచి సమ్మెకు సిద్ధం.. డివిజన్ ఆఫీసుల వద్ద నిరసన**



**నల్లగొండ, మహా :** తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (TVAE JAC) పిలుపు మేరకు ఆర్టిజన్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై పోరుబాట పట్టారు. ఏప్రిల్ 8 నుంచి చేపట్టనున్న సమ్మెకు సన్నద్ధమౌతూ గురువారం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా డివిజన్ కార్యాలయాల ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి వివిధ కార్మిక సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులకు ఏపీఎస్ఈబీ (APSEB) సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. విద్యా అర్హతలను బట్టి కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలని ఆర్టిజన్లుగా గుర్తించకుండా మిగిలిపోయిన కార్మికులను తక్షణమే గుర్తించాలని కోరారు. టీజీఎస్పీడీసీఎల్ (TGSPDCL) తరహాలోనే టీజీఎన్‌పీడీసీఎల్ (TGNPDCL)లోని లైన్ మ్యాన్ హెల్పర్లకు ఆర్టిజన్ హోదా కల్పించాలని పట్టుబట్టారు. వీటితో పాటు పీస్ రేట్, మీటర్ రీడింగ్ కార్మికులు, కలెక్షన్ ఏజెంట్లు, సెక్యూరిటీ గార్డులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించి, నెలకు 30 రోజుల పని కల్పించాలని నిరసన గళం విప్పారు. ఈ ధర్నాకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, 327 యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి సుమ్మిరెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్, 1104 యూనియన్ నేతలు శ్రీనివాస్, శిరు రాంబాబు, టీఆర్‌వీకేఎస్ డివిజన్ కార్యదర్శి మైనం ఉపేందయ్య పాల్గొని సంఘీభావం తెలిపారు. నల్లగొండ జిల్లా ఉమ్మడి జేఏసీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ జెట్టబోయిన లింగస్వామి యాదవ్, కన్వీనర్ మద్ది శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోకన్వీనర్లు వేణుగోపాల్ రెడ్డి, చుప్పలపల్లి రమేష్, బొమ్మి సహదేవ్, మెకల బిక్షమయ్య, పేరి షేర్, విజయ్, ఉమాదేవి, రజియా, శైలజ, లింగారెడ్డి, భూషణం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరుల కుటుంబాలను గుర్తించాలి

**మలిదశ ఉద్యమకారుడు మాజీ జెడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్**



**వలిగొండ మార్చి, మహా** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసి అమరులైన కుటుంబాలను గుర్తించాలని మలిదశ ఉద్యమకారుడు వలిగొండ మాజీ జడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్ అన్నారు గురువారం అమరుడు కొన పూరి సాంబశివుడి 15 వర్ధంతి సందర్భంగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు అనేకమంది బలిదానాలు చేస్తూ త్యాగాలు చేస్తూ అమరులైనటువంటి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షత వహించిన మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ మాట్లాడుతూ అమరులు సాంబశివుడు రాములన్న మానవ చరిత్ర ఉన్నంతకాలం చరిత్రలో నిలిచిపోతారని వారి జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయని గుర్తు చేశారు ఈ సమావేశంలో సాంబశివుడు కూతురు స్వర్ణలత కొనపూరి రాములు భార్య మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్కోనపూరి కవిత మాజీ సర్పంచ్ కొమురెల్లి సంజీవరెడ్డి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి ఆంధ్రప్రభ దినపత్రిక పాత్రికేయులు పడమటి దామోదర్ రెడ్డి ఆంధ్రజ్యోతి పాత్రికేయులు దూలం శ్రీనివాస్స ర్పంచ్ రాపోలు గోపి సర్పంచ్ పడమటి మమత నరేందర్ రెడ్డి నారి నరసింహ వరమ్మమాద శంకర్ కొనపూరి చిన్న శ్రీశైలం ఎమ్మె లింగస్వామి మంటి లింగయ్య అజ్జు.తదితరులు పాల్గొన్నారు.

## మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**ఛింద్వాడా (మధ్యప్రదేశ్),మహా:** మధ్యప్రదేశ్ రాష్ట్రం భండార్‌కుండ్ ప్రాంతంలో ముఖ్యమంత్రి నిర్వహించిన ఒక భారీ కార్యక్రమానికి హాజరై, సంతోషంగా బస్సులో తిరుగుప్రయాణమైన అమాయక ప్రయాణికులను మృత్యువు కాటేసింది. నాగ్‌పూర్ రహదారిపై ఛింద్వాడా పరిధిలోని సిమరియా వద్దకు రాగానే, బస్సు డ్రైవర్ ముందు వెళ్తున్న మరో వాహనాన్ని అత్యంత వేగంగా ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. ఆ క్షణంలోనే ఎదురుగా వెల్లుల్లి బస్తాల లోడుతో అతివేగంగా దూసుకొచ్చిన భారీ ట్రక్కును బస్సు బలంగా ఢీకొట్టింది. రెండు భారీ వాహనాలు ఎదురెదురుగా అత్యంత వేగంగా ఢీకొనడంతో బస్సు ముందు భాగం, కుడి వైపు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ఆ భీకర శబ్దానికి చుట్టుపక్కల ప్రాంతాలు దద్దరిల్లిపోయాయి. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు అసలు ఏం జరిగిందో తెలిసేలోపే పది నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. బస్సు ఇనుప రేకుల మధ్య ఇరుక్కుపోయిన క్షతగాత్రుల ఆర్తనాదాలు, హాహాకారాలు ఆ ప్రదేశాన్ని ఒక మృత్యులోకంగా మార్చేశాయి. కళ్లెదుటే తమ వారు రక్తపు మడుగులో ప్రాణాలు వదులుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో తోటి ప్రయాణికులు పెట్టిన రోదనలు అక్కడున్నవారిని సైతం కలచివేశాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఛింద్వాడా కలెక్టర్ హరేంద్ర నారాయణ్, పోలీసు అధికారులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

## విరాళాల ప్రవాహం.. కమలనాథులకే సింహభాగం

- మిగతా పార్టీలన్నింటికంటే పదిరెట్లు అధికంగా బీజేపీకి ఫండ్స్!
- బీజేపీ ఖాతాలో ఏకంగా రూ. 6,074 కోట్లు
- జాతీయ పార్టీల ఫండ్స్ 161 శాతం జంప్..కాంగ్రెస్‌కు దక్కింది కేవలం రూ. 517 కోట్లే!

**ఢిల్లీ, మహా:** భారతదేశ రాజకీయాల్లో ఎన్నికల రణరంగాన్ని శాసించేది ప్రధానంగా నిధులే. ఏ పార్టీ దగ్గర ఎన్ని నిధులు ఉంటే, ఆ పార్టీ ప్రచారం అంత పటిష్టంగా ఉంటుంది. అయితే, దేశంలోని జాతీయ పార్టీలకు అందుతున్న విరాళాల లెక్కలు చూస్తే కళ్లు బైర్లు కమ్మకమానవు. 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 20 వేల పైబడి పార్టీలకు అందిన విరాళాల చిట్టాను 'అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్' గురువారం ప్రజల ముందు ఉంచింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పార్టీల విరాళాలు ఏకంగా 161 శాతం పెరగడం ఒక ఎత్తైతే.. దేశంలోని ఇతర జాతీయ పార్టీలన్నింటికీ కలిపి వచ్చిన మొత్తం కంటే, అధికార బీజేపీ ఒక్కదానికే పదిరెట్లు అధికంగా విరాళాలు లభించడం రాజకీయ వర్గాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది.

**కోట్లలో కురుస్తున్న కార్పొరేట్ కనకవర్షం**

ఏడీఆర్ నివేదిక ప్రకారం.. 202425 ఆర్థిక సంవత్సరంలో అన్ని జాతీయ పార్టీలకు కలిపి మొత్తం 11,343 విరాళాల ద్వారా ఏకంగా రూ. 6,648.563 కోట్లు సమకూరాయి. ఇందులో అధికార బీజేపీకి ఏ పార్టీ దరిదాపుల్లో కూడా లేకపోవడం గమనార్హం. బీజేపీకి 5,522 విరాళాల ద్వారా అత్యధికంగా రూ. 6,074.015 కోట్లు అందాయి. ఆ తర్వాతి స్థానంలో నిలిచిన ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి 2,501 విరాళాల ద్వారా దక్కింది కేవలం రూ. 517.394 కోట్లు మాత్రమే. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ , సీపీఐఎం , నేషనల్ పీపుల్స్ పార్టీ లకు కలిపి వచ్చిన మొత్తం విరాళాల కంటే కూడా బీజేపీకి వచ్చిన విరాళాలు పది రెట్లు అధికంగా ఉండటం ఆ పార్టీ ఆర్థిక మూలాల బలానికి అద్దం పడుతోంది. ఇక మాయావతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీ గత 19 ఏళ్లుగా అనుసరిస్తున్న ట్రెండ్‌నే కొనసాగిస్తూ, ఈసారి కూడా తమకు రూ. 20 వేల పైబడిన విరాళాలు ఏవీ రాలేదని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (202324)తో పోలిస్తే జాతీయ పార్టీల విరాళాల్లో ఏకంగా రూ. 4,104.285 కోట్ల మేర భారీ పెరుగుదల నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే బీజేపీ విరాళాలు రూ. 2,243.947 కోట్ల నుంచి ఏకంగా 171 శాతం మేర జంప్ అయ్యాయి. అటు కాంగ్రెస్ పార్టీ విరాళాలు కూడా రూ. 281.48 కోట్ల నుంచి 84 శాతం వృద్ధితో రూ. 517.394 కోట్లకు చేరుకున్నాయి. ప్రాంతీయ పార్టీ హోదా నుంచి జాతీయ పార్టీగా ఎదిగిన ఆమ్ ఆద్మీ పార్టీ 244 శాతం వృద్ధితో రూ. 27.044 కోట్లు నిధులు సాధించగా, నేషనల్ పీపుల్స్ పార్టీ అనూహ్యంగా 1,313 శాతం వృద్ధితో రూ. 1.943 కోట్లు విరాళంగా పొందింది. రాజకీయ పార్టీలకు అందుతున్న ఈ వేల కోట్ల నిధుల్లో ఆధిపత్యం అంతా కార్పొరేట్ సంస్థలదే కావడం విశేషం. మొత్తం విరాళాల్లో 92.18 శాతం కేవలం కార్పొరేట్ సంస్థల నుంచే వచ్చాయి. 3,244 కార్పొరేట్ విరాళాల ద్వారా రూ. 6,128.787 కోట్లు సమకూరగా.. 7,900 మంది వ్యక్తిగత దాతల నుంచి కేవలం 7.61 శాతం అనగా రూ. 505.66 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇందులోనూ కమలనాథులదే పైచేయి. బీజేపీకి 2,794 కార్పొరేట్ విరాళాల ద్వారా రూ. 5,717.167 కోట్లు వచ్చాయి. ఇది మిగతా జాతీయ పార్టీలన్నీ కలిపి పొందిన కార్పొరేట్ విరాళాల (రూ. 411.62 కోట్లు) కంటే ఏకంగా 13 రెట్లు ఎక్కువ కావడం విస్మయపరుస్తోంది. ఇక బీజేపీకి 2,627 మంది వ్యక్తుల నుంచి రూ. 345.94 కోట్లు రాగా, కాంగ్రెస్ పార్టీకి 112 కార్పొరేట్ విరాళాల ద్వారా రూ. 383.86 కోట్లు, 2,357 మంది వ్యక్తుల ద్వారా రూ. 132.39 కోట్లు అందాయి. అత్యధికంగా విరాళాలు ఇచ్చిన దాతల జాబితాను పరిశీలిస్తే ఎలక్టోరల్ ట్రస్ట్‌ల దే అగ్రస్థానం. 'ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్' అత్యధికంగా రూ. 2,413.465 కోట్లను బీజేపీ, కాంగ్రెస్, ఆప్ లకు విరాళంగా ఇచ్చింది. ఇందులో బీజేపీకి రూ. 2,180.7119 కోట్లు (35.90%), కాంగ్రెస్‌కు రూ. 216.335 కోట్లు (41.81%), ఆప్‌కు రూ. 16.4178 కోట్లు (43.08%) అందాయి. 'ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్' కేవలం రెండు విరాళాల ద్వారా రూ. 834.97 కోట్లు ఇవ్వగా, 'ఏబీ జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్' 16 విరాళాల ద్వారా రూ. 621 కోట్లు ఇచ్చింది. 'న్యూ డెమొక్రాటిక్ ఎలక్టోరల్ ట్రస్ట్' ఏడు విరాళాల ద్వారా రూ. 155 కోట్లను బీజేపీ, కాంగ్రెస్‌లకు పంచింది. ఇక కార్పొరేట్ దిగ్గజాల విషయానికొస్తే.. కరోనా వ్యాక్సిన్‌తో వెలుగులోకి వచ్చిన 'సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' మూడు విరాళాల ద్వారా రూ. 100 కోట్లను, 'రుంగ్టా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్' నాలుగు విరాళాల ద్వారా రూ. 95 కోట్లను అధికార బీజేపీకి విరాళంగా అందించాయని ఏడీఆర్ నివేదిక కుండబద్దలు కొట్టింది.

## ఎంజీయూలో నీళ్ల కరువు..

- ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా
- ట్యాంకర్ నీళ్ల తో హాస్టల్ విద్యార్థుల స్నానాలు..
- అధికారుల నిర్లక్ష్యంపై విద్యార్థి లోకం ఆగ్రహం



**నల్లగొండ, మహా :** నల్లగొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో నెలకొన్న తీవ్రమైన నీటి సమస్యను నిరసిస్తూ గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు హాస్టళ్ల వద్ద భారీ ఆందోళన చేపట్టారు. గత నెల రోజులుగా హాస్టళ్లలో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. కనీసం స్నానం చేయడానికి కూడా నీళ్లు లేని దుస్థితి ఏర్పడటంపై విద్యార్థి నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఏబీవీపీ యూనివర్సిటీ అధ్యక్షుడు హనుమాన్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ పరిపాలన విభాగం వైఫల్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు.ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా, అవి హాస్టల్ గదుల వరకు చేరడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ ప్రాథమిక అవసరాల కోసం బయట స్నానాలు చేయాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందని వారు ధ్వజమెత్తారు. యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న కొత్త భవన నిర్మాణాల కోసం నీటిని మళ్లించడం వల్లే హాస్టళ్లలో ఈ సంక్షోభం తలెత్తిందని హనుమాన్ ఆరోపించారు. విద్యార్థుల అవసరాలను గాలికొదిలేసి కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వడం అన్యాయమని ఆయన ఖండించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని యూనివర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## బుకింగ్ లేక ఇబ్బందులు



**కుషాయిగూడ, మహా :** కాప్రా సర్కిల్ పరిధిలోని డా ఏఎస్ రావు నగర్ డివిజన్ ప్రాంతంలో గ్యాస్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండియన్ గ్యాస్ సరఫరాలో జాప్యం, ఆన్ లైన్ బుకింగ్ వ్యవస్థ పనిచేయకపోవడంతో కస్టమర్లు ఆందోళనకు దిగారు. స్థానిక ఎన్ఆర్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోగదారులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా గ్యాస్ సిలిండర్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అందడం లేదని వాపోయారు. ఆన్ లైన్‌లో బుకింగ్ చేయడానికి ప్రయత్నించినా సర్వర్ పని చేయకపోవడంతో మరింత ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. తక్షణమే సమస్యను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న సిలిండర్లను సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

**స్థానికుల డిమాండ్**



**కుషాయిగూడ, మహా :** మీర్ పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో రోడ్డు భద్రతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, ఎన్ఎఫ్‌సీ రోడ్‌లో గణేష్ టీ పాయింట్ వద్ద ఉన్న యూటర్న్‌ను మూసివేయాలని కోరుతున్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి కుషాయిగూడ సిఐ రాజు మరియు సిబ్బందితో కలిసి గురువారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తిరుమలనగర్ కమాన్, వెంకటేశ్వరనగర్ చౌరస్తా, ఇంద్రనగర్ ఫేజ్ 2 కమాన్, వసుంధర కాలేజ్ సమీపంలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు అత్యవసరమని తెలిపారు. రోజువారీ రద్దీ ఎక్కువగా ఉండే ఈ ప్రాంతాల్లో ప్రజల భద్రత దృష్ట్యా తగు చర్యలు తీసుకోవాలని సిఐని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై లింగారెడ్డి, మల్లేష్ గౌడ్, శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల వేతనాల పెంపు కోసం మార్చి 28 చలో హైదరాబాద్

**తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రేవతి కళ్యాణి**



**కుషాయిగూడ, మహా :** ఆషా వర్కర్ల పెంపు డిమాండ్ తో ఈ నెల 28 న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆషా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రేవతి కళ్యాణి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని, వీరంతా మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులున్నారన్నారు. నేటికి వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనీస గ్యారెంటీ ఫిక్సిడ్ వేతనం కూడా ఇప్పటివరకు నిర్ణయం చేయలేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని తెలియజేసి మాట తప్పిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా వేతనాలు పెంచలేదని, 50 లక్షల ఇన్సూరెన్స్, 50 వేల మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు ఇచ్చినా, ఇంకా అమలు చేయటం లేదన్నారు. ఆశా వర్కర్లు అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇప్పటికైనా ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తిస్తూ వాళ్ల మేనిఫెస్టోలో పెట్టిన 18000 ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలని లేకుంటే ఆశా వర్కర్లు పని బంద్ చేసి నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. 28న జరగనున్న లో హైదరాబాద్ ప్రోగ్రాం విజయవంతం చేయాలని కోరారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 27-03-2026





# 'సంక్రాంతి' హీరోయిన్లు ఫిక్స్.. వెంకీతో తొలిసారి!

వెంకటేశ్-కల్యాణ్ రామ్ హీరోలుగా ఓ క్రేజీ మల్టీ స్టారర్ మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాలో హీరోయిన్లు ఎవరు? అనే విషయంపై అధికారిక ప్రకటన రాలేదు. అయితే వెంకటేశ్-కల్యాణ్ రామ్‌లకు సరైన జోడీ కోసం అనిల్ రావిపూడి వేట మొదలెట్టారట. ఇందులో భాగంగా ఇద్దరు ముగ్గురు హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. వెంకటేశ్‌కి జోడీగా 'మహానటి' మూవీ ఫేమ్ కీర్తి సురేష్ నటించనున్నారనే వార్తలు నెట్టింట సందడి చేస్తున్నాయి. ఇప్పటివరకూ వెంకటేశ్-కీర్తి సురేష్ కలిసి నటించలేదు. వీరి కాంబినేషన్ అయితే ప్రేక్షకులకు కొత్తగా ఉంటుందనే ఆలోచనతో ముందుకెళుతున్నారట అనిల్ రావిపూడి. ఇక కల్యాణ్ రామ్‌కి జోడీగా నటించనున్న హీరోయిన్ల జాబితాలో ప్రధానంగా ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి. వారిలో కృతీ శెట్టి, కయాదు లోహర్ ఉన్నారు. 'ఉప్పెన, శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు' వంటి పలు హిట్ సినిమాలతో ప్రేక్షకుల్లో గుర్తింపు సొంతం చేసుకున్న కృతీ శెట్టి పేరు బలంగా వినిపిస్తోంది. అలాగే 'డ్రాగన్, అల్లూరి, ఫంకీ' చిత్రాల ఫేమ్ కయాదు లోహర్ పేరు కూడా తెరపైకి వచ్చింది. మరి... వెంకటేశ్‌కి జోడీగా కీర్తి నటిస్తారా? లేదా? కల్యాణ్ రామ్‌కి జంటగా కృతీ, కయాదు లోహర్‌లలో ఎవరు ఫైనల్ అవుతారు? లేకుంటే మరో హీరోయిన్ ఫిక్స్ అవుతారా? అనే విషయాలపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. ఈ సినిమా 2027 సంక్రాంతికి రిలీజ్ కానుంది.





# మేము విడిపోవాలని కోరుకుంటున్నారా..

బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా విడాకులు తీసుకుంటుందంటూ నాలుగేళ్లుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇలాంటి రూమర్స్‌కు గతంలోనే చెక్ పెట్టిన ఆమె తాజాగా మరోసారి ఒక ఇంటర్వ్యూలో స్పందించారు. తాను సోషల్‌మీడియాలో ఏదైనా ఫొటోని పంచుకుంటే ఏవేవో ఊహించుకుంటుంటూ కొందరు అదేపనిగా తప్పుగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రాజమౌళి మహేశ్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'వారణాసి'లో హీరోయిన్‌గా నటిస్తున్న ప్రియాంక తాజాగా తన భర్త నిక్ జొనాస్ గురించి మాట్లాడారు. ప్రియాంక చోప్రా.. నిక్ జొనాస్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. తాము ఇద్దరం జీవితంలో ఎంతో సంతోషంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. బయటి విషయాలకు పెద్దగా ప్రాముఖ్యత ఇవ్వమని ఆమె అన్నారు. అయితే, తాము విడాకులు తీసుకుంటున్నామంటూ కొన్ని కథనాలు వచ్చినట్లు తెలిసిందన్నారు. తమ వివాహబంధం ముగిసిపోవాలని వారు కోరుకుంటున్నారా..? అని ఆమె ప్రశ్నించారు. తరచుగా ఇలాంటి రూమర్స్ ఎందుకు వైరల్ చేస్తున్నారో ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. 'మేము వేర్వేరు దేశాలకు చెందడంతో పాటు వేర్వేరు మతాలు, మా ఇద్దరి మధ్య వయసు తేడా ఇలా కొన్ని కారణాలు ఎవరినైనా ఇబ్బంది పెట్టి ఉండొచ్చు. ఎనిమిదేళ్లుగా మేము చాలా సంతోషంగా కలిసే ఉంటున్నాం. నిక్ జొనాస్ పరిచయం అయిన తర్వాత ఆరు నెలల్లోనే పెళ్లి చేసుకున్నాం. మా గురించి ఎవరు ఏమనుకున్నా పట్టించుకోవడం మానేశాను. నిక్‌ని కలిశాక.. తానే నా జీవితానికి సరైన జోడీ అనిపించి మరో అడుగు ముందుకువేశాను' అని క్లారిటీ ఇచ్చారు. తన కుటుంబ భద్రత విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటానని ప్రియాంక చోప్రా చెప్పారు. తన కుమార్తె మాల్టి మేరి గురించి చాలా అప్రమత్తంగా ఉంటానని ఆమె అన్నారు. తమ అనుమతి లేకుండా చాలామంది మాల్టి మేరి ఫోటోలు తీసి నెట్టింట వైరల్ చేయడం తనకు నచ్చదని ఆమె తెలిపారు. అలాంటి వాటికి చెక్ పెట్టేందుకే సెక్యూరిటీని పెట్టుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. అయితే, తనతో ఎవరైనా ఫోటోలు దిగొచ్చని ఆమె క్లారిటీ ఇచ్చింది. కానీ, తన కూతురి ప్రైవసీని కాపాడటం తన బాధ్యతని ప్రియాంక చెప్పుకొచ్చింది.



# అందమే ఆనందం..

అందమే ఆనందం. ఆనందమే జీవిత మకరందం అన్నారో మహాకవి. అవును ఆనాటి నుంచి ఈనాటి వరకు, ఏనాటి వరకైనా జీవితం అందం గురించే పరుగులు తీస్తుంది అనడంలో ఏమాత్రం అతిశయోక్తి ఉండదు. అలా అందమైన నగుమోము కలిగిన అతిథులకు వయసు గుర్తుకు రాదని చెప్పడానికి పలు ఉదాహరణలు ఉన్నాయి. ఎక్కడికో ఎందుకు మనం నటి జ్యోతికనే తీసుకుంటే 1997లో ఒక హిందీ చిత్రంతో నాయకిగా రంగప్రవేశం చేసి, ఆ వెంటనే అంటే 1998లో అజిత్ హీరోగా నటించిన వాలి చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రమే సంచలన విజయాన్ని సాధించడం, జ్యోతిక నటన ప్రశంసనీయంగా ఉండడంతో ఆ తరువాత ఆమెకు నటిగా ఎదురు తిరిగి చూసుకునే అవకాశం రాలేదు. తమిళం, తెలుగు,హిందీ వంటి పలు భాషల్లో నటిస్తూ అగ్ర కథానాయికిగా రాణిస్తున్నారు. చంద్రముఖి చిత్రంలో ఈమె నటన రిమార్కబుల్. టైటిల్ రోల్‌లో అంత అద్భుతంగా నటించారు. అలా రెండు దశాబ్దాలకు పైగా నటిస్తూ ఎవర్ గ్రీన్ నాయకి పేరు తెచ్చుకున్న జ్యోతిక కెరీర్ ప్రారంభంలోనే నటుడు సూర్యను ప్రేమించి పెళ్లాడారు. వీరి పెళ్లి 2006 జరిగింది. ఆ తరువాత కొంతకాలం సంసార జీవితానికి పూర్తిగా సమయాన్ని కేటాయించారు. సూర్య, జ్యోతిక దంపతులకు దేవ్ అనే కొడుకు, దియా అనే కూతురు ఉన్నారు. పిల్లలు చదువుపై దృష్టి పెట్టిన తరువాత జ్యోతిక మళ్లీ నటనపై దష్టి పెట్టారు. అయితే తన ఇమేజ్ కు సరిపోయే ఉమెన్ సెంట్రిక్ కథా పాత్రలను ఎంపిక చేసుకుని నటిస్తున్నారు. కాగా ఇటీవల బాలీవుడ్‌పై ఎక్కువగా దష్టి పెడుతున్నారు.అలా ఈమె నటుడు అజయ్ దేవగన్‌తో కలిసి నటించిన సైతాన్ చిత్రం 2024లో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ప్రస్తుతం రెండు వెబ్ సిరీస్‌లో నటిస్తున్న జ్యోతిక తన అందాలను పదిల పరచుకోవడానికి తీవ్రంగా కసరత్తు చేస్తుంటారు. అందుకే 47 ఏళ్ల వయసులో కూడా ఆమె చాలా అందంగా, ఎనర్జిటిక్ గా కనిపిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా జ్యోతిక కొత్తగా ఫుల్ ఫిట్‌నెస్‌తో కూడిన తన ఫొటోలను మీడియాకు విడుదల చేశారు. అవి ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.

# తెలుగు కుర్రాళ్ల ఆరాధ్య దేవత..

ఒక్క సినిమాతోనే సౌత్ ఇండస్ట్రీలో సెన్సేషన్ అయ్యింది. ఇప్పుడు ఆమె పేరు సినీరంగంలో మారుమోగుతుంది. అలాగే తెలుగు, తమిళం భాషలలో వరుస హిట్స్ అందుకుంటుంది. అలాగే అటు సోషల్ మీడియాలో వరుస పోస్టులతో హాట్ టాపిక్ అవుతుంది. ఇప్పుడు ఆమె యూత్ లో విపరీతమైన క్రేజ్ ఉంది. అయితే సినిమాల్లోకి రాకముందు తాను ఒక బట్టల దుకాణంలో పనిచేశానని చెప్పుకొచ్చింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..

ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్' చిత్రంతో హీరోయిన్ కయాదు లోహర్ మంచి పేరు సంపాదించుకుంది. ప్రస్తుతం ఆమె తమిళం, తెలుగు చిత్రసీమలలో చాలా బిజీగా ఉంది. ఇటీవల ఆమె సాయి అభయంకతో కలిసి 'పవళ్ మళ్ళీ' అనే పాటలో డ్యాన్స్ చేసింది. ఈ పాట ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. మరోవైపు తెలుగులోనూ బ్యాక్ టూ బ్యాక్ అవకాశాలు అందుకుంటుంది. ఈ నేపథ్యంలో, చిత్రసీమలోకి రాకముందు తాను చేసిన ఉద్యోగాల గురించి కయాదు లోహర్ చెప్పిన మాటలు వైరల్ అవుతున్నాయి. తాను బట్టల దుకాణం నుండి స్టార్‌బక్స్ వరకు చాలా చోట్ల పనిచేశానని, తనకు ల్యాప్‌టాప్‌ను సరిగ్గా ఎలా ఉపయోగించాలో కూడా తెలియదని ఆమె చెప్పింది. ఈ విషయం గురించి మాట్లాడుతూ "సినిమా రంగంలోకి రాకముందు నేను చాలా పనులు చేశాను. స్టార్‌బక్స్‌లో, ఒక బట్టల దుకాణంలో పని చేశాను. చాలా ఐటీ కంపెనీలలో కూడా పనిచేశాను. కానీ ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, నాకు ల్యాప్‌టాప్‌ను సరిగ్గా ఎలా ఉపయోగించాలో కూడా తెలియదు. ఐటీ కంపెనీలలో కూడా, నేను కేవలం శిక్షణ సమయంలో మాత్రమే పనిచేశాను," అని ఆమె చెప్పారు. ఇలాంటి ఎన్నో కష్టాల తర్వాతే తాను నటిగా అడుగుపెట్టానని కయాదు లోహర్ తెలిపారు.
నటి కయాదు లోహర్, టోవినో థామస్ కథానాయకుడిగా నటిస్తున్న 'పల్లిచట్టంబి' చిత్రంతో మలయాళ చిత్రసీమలోకి తిరిగి వస్తున్నారు. డిజె జోస్ ఆంటోనీ దర్శకత్వంలో, టోవినో థామస్ కథానాయకుడిగా నటిస్తున్న 'పల్లిచట్టంబి' టీజర్ ఇటీవల విడుదలైంది. అంతకుముందు విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు, పాటలు సోషల్ మీడియాలో విశేష ఆదరణ పొందాయి. తెలుగులో చివరగా విశ్వక్ సేన్ సరసన ఫంకీ చిత్రంలో నటించింది. ఈ చిత్రానికి కెవి అనుదీప్ దర్శకత్వం వహించారు. మంచి హైప్ అందుకున్న ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది కయాదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com